తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
జనంసాక్షి
www.janamsakshi.org
మెదక్ - మహబూబ్‌నగర్
సంగారెడ్డి | సిద్దిపేట
జోగులాంబ గద్వాల
వనపర్తి | నారాయణపేట
నాగర్ కర్నూల్
మంగళవారం
03 నవంబర్ 2026
Follow :



నిన్నటిదాకా ఎల్‌నినో... నేడు ముసురు!

పగబట్టిన ప్రకృతి.. తడిసిముద్దయిన వరి ధాన్యం

హన్మకొండ, నవంబర్ 2 (జనంసాక్షి): ఎవుసమంటేనే కష్టానికి ఎదురెళ్ళడం, నష్టాలను భరించడం నారువోసింది మొదలుకుని పంటనూర్పేదాకా అడుగడుగునా అన్నీ అవరోదాలే, కూలీల కొరత, ఎరువుల కరువు, కరెంటు కోతలు ఇలా ఒకదాని వెంట ఒకటి రైతులపై దాడి చేస్తూనే ఉన్నాయి. ఆఖరికి వరి ధాన్యం అమ్మాలన్నా అరిగోసలే, కొనుగోలు కేంద్రాల్లో అరకొర సౌకర్యాలు, రవాణా లోటు ఇలా వీటన్నింటినీ ఎదుర్కొంటు ముందుకు సాగుతున్న రైతు వరునుడి దెబ్బకు కుదేలవుతున్నాడు. నిన్నటిదాకా ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావం తలెత్తి పంటలు ఎండుముఖం పట్టాయి, వాన రాక కోసం రైతులు నింగికేసి ఎదురు చూసినా చినుకు జాడ కనిపించలేదు. పంటలను కాపాడుకునేందుకు రైతులు భగీరథ ప్రయత్నమే చేశారు. వాటర్ ట్యాంకుల ద్వారా పంటకు తడులు పెడుతూ సాగు చేసిన పంటలో కొంత భాగాన్ని చేజిక్కించుకున్నారు. ఎల్‌నినో దెబ్బకు పాక్షికంగా పంటలు ఎండిపోగా చేతికొచ్చిన సగం పంటపై మురసు తుఫాను పంజా విసురుతోంది. మండలంలో సోమవారం హఠాత్తుగా వర్షం



కురవడంతో రైతులు తలలు పట్టుకున్నారు. కల్లాల్లో ఆరబోసిన వరి ధాన్యం తడిసి ముద్దయింది. ఒక్కసారిగా వాతావరణంలో అనూహ్య మార్పులు చోటు చేసుకుని వర్షం కురవడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.రైతులపై ప్రకృతి పగబట్టిందంటూ ఆవేదన వ్యక్తం చేశారు.

కులవివక్ష బాధిత కుటుంబానికి హరీశ్ రావు భరోసా

- **నిందితులను తక్షణమే అరెస్టు చేసి కఠిన చర్యలు తీసుకోవాలి**



వనపర్తి బ్యూరో, నవంబర్ 2 (జనంసాక్షి): మండలంలోని మంగంపల్లి గ్రామంలో ఇటీవల కులవివక్షకు గురైన మసాని సుధీర్ కుటుంబ సభ్యులను మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీశ్ రావు పరామర్శించారు. బాధిత కుటుంబ సభ్యుల స్వగృహానికి వెళ్లిన ఆయన, వారితో ఆప్యాయంగా మాట్లాడి తేనీరు స్వీకరించారు.ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ సమాజంలో అస్పృశ్యత, అసమానతలు, అంటరానితనాన్ని ప్రోత్సహించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. స్వయంగా ఒక ఎమ్మెల్యే ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రాంతంలో దళితుల పట్ల కులవివక్ష ప్రదర్శించడం అత్యంత దురదృష్టకరమని, ఇలాంటి ఘటనలను ఏమాత్రం సహించేది లేదని అన్నారు.ఈ ఘటనకు బాధ్యులైన నిందితులను తక్షణమే అరెస్టు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బాధితుడు మసాని సుధీర్ మనోధైర్యాన్ని కోల్పోవద్దని, తాము ఎల్లప్పుడూ అండగా ఉంటామని హరీశ్ రావు భరోసా ఇచ్చారు. బాధిత కుటుంబానికి న్యాయం జరిగే వరకు అండగా నిలుస్తామని స్పష్టం చేశారు.

లిఫ్ట్ ఇరిగేషన్ పరికరాల చోరీకి యత్నం.. ఇద్దరు పట్టివేత

- **గ్రామస్తుల అప్రమత్తతతో పోలీసులకు అప్పగింత.. కేసు నమోదు**


మిగతా 3లో..



చిన్నంబావి, నవంబర్ 2 (జనంసాక్షి): చిన్నంబావి మండలంలోని చెల్లెపాడు గ్రామంలో 750 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించే లిఫ్ట్ ఇరిగేషన్ పరికరాలను చోరీ చేసేందుకు ప్రయత్నిస్తున్న ఇద్దరిని గ్రామస్తులు పట్టుకుని పోలీసులకు అప్పగించారు. గ్రామస్తుల అప్రమత్తతతో చోరీ యత్నం వెలుగులోకి వచ్చింది. ఈ ఘటనపై లిఫ్ట్ ఇరిగేషన్

ఆస్తినేరాల నియంత్రణకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలి

- **సంగారెడ్డి ఏఆర్ హెడ్‌క్వార్టర్స్‌ను తనిఖీ చేసిన ఐజీ షానవాజ్ ఖాసిం**





సంగారెడ్డి బ్యూరో, నవంబర్ 2 (జనంసాక్షి): ఆస్తి సంబంధిత నేరాల నియంత్రణకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికలు రూపొందించి, నేరాల నివారణకు పటిష్ట చర్యలు చేపట్టాలని మల్టీ జోన్-2 ఐజీ షానవాజ్ ఖాసిం పోలీసు అధికారులను ఆదేశించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా సోమవారం సంగారెడ్డి జిల్లా ఏఆర్ హెడ్‌క్వార్టర్స్‌ను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆర్ఐ స్టోర్, మోటారు వాహనాలు, జాగిలాల విభాగం, బాంబు నిర్వీర్య బృందం పనితీరును సమీక్షించారు.



పోలీసు ఆయుధాలు, రక్షణ పరికరాలు అందుబాటులో ఉండేలా చూడాలని, వాహనాలకు క్రమం తప్పకుండా మరమ్మతులు చేయించి వినియోగానికి సిద్ధంగా ఉంచాలని సూచించారు. జాగిలాల ఆరోగ్యం, ఆహారం, సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు. విధుల్లో ప్రతిభ కనబరిచిన సిబ్బందిని అభినందించి, వారికి పురస్కారాలు ప్రకటించారు.

అనంతరం డీఎస్పీలతో నిర్వహించిన సమీక్షలో అనుమానాస్పద వ్యక్తులు, వాహనాలపై నిఘా పెంచాలని, సమాజంతో సంబంధాలను బలోపేతం చేస్తూ నేరాల నివారణకు ముందస్తు సమాచార సేకరణ చేపట్టాలని సూచించారు. ఏఆర్ హెడ్‌క్వార్టర్స్ నిర్వహణ, రికార్డుల నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, అదనపు ఎస్పీలు చైతన్య రెడ్డి, శ్రీనివాస రావు, డీఎస్పీలు, ఆర్ఐలు, ఇన్‌స్పెక్టర్లు, ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.

మరుగుదొడ్ల దుర్వినియోగం దారుణం

గద్వాల, నవంబరు 2(జనంసాక్షి): పట్టణంలోని రాజీవ్‌మార్గ్ ప్రజల అవసరాల కోసం 'స్వచ్ఛ తెలంగాణ' కార్యక్రమంలో భాగంగా నిర్మించిన పబ్లిక్ టాయిలెట్లు పక్కదారి తప్పాయి.

ప్రజా వినియోగానికి ఉపయోగపడాల్సిన ఈ మరుగుదొడ్ల గదులను కొందరు ఏకంగా మెకానిక్ షాపులుగా మార్చేసి వాడేసుకుంటున్నారు. లక్షల రూపాయల ప్రజాధనంతో నిర్మించిన ప్రాజెక్టు ఇలా దుర్వినియోగమవుతున్నా మున్సిపల్ అధికారులు పట్టించుకోకపోవడంపై స్థానికులు అగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ముఖ్యంగా మహిళలు, వ్యాపారులు, నిత్యం ప్రయాణించే వారు బహిరంగ మలమూత్ర విసర్జన చేయాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్వచ్ఛ భారత్, స్వచ్ఛ తెలంగాణ ఆశయాలకు ఇటువంటి చర్యలు తూట్లు పొడుస్తున్నాయని సామాజిక కార్యకర్తలు మండిపడుతున్నారు.

బహిరంగ ప్రదేశాలలో టాయిలెట్లను అసాంఘిక కార్యకలాపాలకు, వ్యక్తిగత వ్యాపారాలకు వాడుకోవడం చట్టరీత్యా నేరమని వారు గుర్తు చేస్తున్నారు. ప్రజా ఆస్తులను కాపాడాల్సిన బాధ్యత కేవలం అధికారులదే కాదు, స్థానిక ప్రజలది కూడా అని గ్రహించాలి. ఇలాంటి అక్రమ ఆక్రమణలను చూసి చూడనట్లు వదిలేయడం వల్ల సమాజంలో బాధ్యతా రాహిత్యం పెరుగుతుంది. మున్సిపల్ ఉన్నతాధికారులు వెంటనే స్పందించి ఈ మెకానిక్ షాపులను తొలగించి, మరుగుదొడ్లను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు. ఇలాంటి ప్రజాపయోగ కట్టడాలను దుర్వినియోగం చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటేనే భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కావని ప్రజలు చర్చించుకుంటున్నారు.



ప్రజావాణికి వచ్చే దరఖాస్తులను
వేగవంతంగా పరిష్కరించాలి: అదనపు కలెక్టర్ సంగీత

- ప్రజా సమస్యల పరిష్కార వేదిక ప్రజావాణి
- ప్రజావాణికి 68 దరఖాస్తులు

సంగారెడ్డి, నవంబర్ 2 (జనంసాక్షి): ప్రజా సమస్యల పరిష్కార వేదిక ప్రజావాణికి వచ్చే దరఖాస్తులను వేగవంతంగా పరిష్కరించాలని, పెండింగ్ దరఖాస్తుల విషయంలో అధికారులు అలసత్వం వహించరాదని అదనపు కలెక్టర్ సంగీత అధికారులను ఆదేశించారు. సోమవారం సంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఆమె ప్రజల నుంచి ధరఖాస్తులను స్వీకరించారు. జిల్లా నలుమూలల నుంచి ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం ప్రజావాణికి వస్తుంటారని, వారి సమస్యలను ప్రాధాన్యతతో పరిశీలించి సత్వర పరిష్కారం చూపాలని సూచించారు.



ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం 68 దరఖాస్తులు అందాయి. వీటిలో సంగారెడ్డి 21, నారాయణఖేడ్ 3, జహీరాబాద్ 2, సంగారెడ్డి కలెక్టరేట్‌లో 42 దరఖాస్తులు వచ్చాయి. అందోల్ డివిజన్‌కు ఎలాంటి వినతులు అందలేదని అధికారులు వెల్లడించారు . వివిధ శాఖల పరిధిలో పెండింగ్‌లో ఉన్న ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని, ముఖ్యమంత్రి ప్రజావాణికి సంబంధించిన పెండింగ్ దరఖాస్తులపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. ప్రజల నుంచి వచ్చిన ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి, నిర్ణీత సమయంలో



పరిష్కరించేలా సంబంధిత శాఖల అధికారులు చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.

కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ జానకిరెడ్డి, సోషల్ వెల్ఫేర్ డిడి అఖిలేష్ రెడ్డి, జిల్లా బిసి సంక్షేమాధికారి జగదీష్, జిల్లా సంక్షేమాధికారిణి లలితా కుమారి, జిల్లా వైద్యాధికారిణి లలిత దేవి, డిఏహెచ్ఓ వసంతకుమారి, డిఎల్ఎస్ఏ అడ్వొకేట్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సజావుగా ప్రజావాణి కార్యక్రమం



నిజాంపేట్, నవంబర్ 2 (జనంసాక్షి): నిజాంపేట్ మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమం సజావుగా నిర్వహించారు. వివిధ గ్రామాల ప్రజలు రేషన్ కార్డులు, పింఛన్లు, ఇళ్ల స్థలాలు, భూ సమస్యలు, ఉపాధి హామీ పనులకు సంబంధించిన వినతులు అధికారులకు అంద జేశారు. ఎంపీడీవో సంగ్రామ్ ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి, సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తా మని తెలిపారు. ప్రజావాణిని ప్రజలు సద్వినియోగం చేసుకోవా లని కోరారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, మండల సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

విద్యార్థులకు షూస్ పంపిణీ...




కోహెడ, నవంబర్ 2(జనంసాక్షి): వింజపల్లి గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో సోమవారం సర్పంచ్ అన్నాడి శ్రీజ-జీవన్ రెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులకు ప్రభుత్వం అందించిన షూస్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ విద్యార్థుల విద్యాభివృద్ధి, సంక్షేమం కోసం ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలు, అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. విద్యా ర్థులకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ రంగన వేని వెంకటస్వామి, వార్డు సభ్యులు అన్నాడి రాజేందర్ రెడ్డి, మంద స్రవంతి-ధర్మేందర్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

సిర్గాపూర్ ప్రజావాణి.. దరఖాస్తులు నిల్

సిర్గాపూర్, నవంబర్ 03 (జనంసాక్షి): సిర్గాపూర్ మండల తహ శీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమం వెలవెలబోయింది. ప్రతి సోమవారం ప్రజల నుండి దరఖాస్తులు స్వీకరించే ఈ కార్యక్రమానికి ఈసారి ఒక్క దరఖాస్తు కూడా రాలేదు. ప్రజలు తమ సమస్యలపై గతంలో ఇచ్చిన దరఖాస్తులకు పరిష్కారం లభించడం లేదని, అధికారులు నిర్లక్ష్యం గా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో ప్రజలు ప్రజావాణి పట్ల విముఖత చూపుతున్నారని స్థానికులు అంటున్నారు. గత కొన్ని నెలలుగా సమస్యలు పరిష్కారం కాక పోవడం, అధికారుల ఆలసత్వం కారణంగానే జనం ప్రజావాణికి రావడం లేదని చర్చ జరుగుతోంది.

ఉదయ్ రంజన్ గౌడ్ చల్లగా ఉండాలి



తూప్రాన్, నవంబర్2(జనంసాక్షి): బిఆర్ఎస్ నాయకులు నాయిని ఉదయ రంజన్ గౌడ్ చల్లగా ఉండాలని కోరుకుంటున్నట్లు బి ఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలిపారు. ఆయన జన్మదినం సందర్భంగా శాలువతో సన్మానించారు. బిఆర్ఎస్ పార్టీ అధికారం లోకి రావడానికి కృషి చేయాలని, అన్ని వర్గాల ప్రజలను సమన్వ యం చేస్తూ పార్టీ చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను మహిళలకు, యువకులకు తెలియజేయాలని వారు కోరడం జరిగింది, తప్పకుండా నా శాయ శక్తుల పార్టీ అభివృద్ధి కోసం, అధికారంలోకి రావడానికి కృషి చేస్తానని ఆయనకు తెలిపారు.

విధి నిర్వహణలో మృతి చెందిన పోలీసు సిబ్బంది కుటుంబాలకు ఎక్స్ గ్రేసీయో

- జిల్లా ఎస్పీ టి.శ్రీనివాస రావు

గద్వాల నడిగడ్డ, సెప్టెంబర్ 2(జనంసాక్షి); విధి నిర్వహణలో మృతి చెందిన పోలీస్ కుటుంబాలకు పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని జిల్లా ఎస్పీ టి. శ్రీనివాస రావు అన్నారు. సోమవారం జిల్లా ఎస్పీ తన ఛాంబర్ లో 2025 సంవత్సరం లో అనారోగ్యం తో మృతి చెందిన హోమ్ గార్డ్ అధికారి ఏ.స్వాములు,2024 సంవత్సరం లో రోడ్డు ప్రమాదం లో మృతి చెందిన హోమ్ గార్డ్ అధికారి కె. ధన్ రాజ్ రాథోడ్ ల కుటుంభ సభ్యులకు ఎక్స్ గ్రేసీయో ఫండ్స్ క్రింద తల 5 లక్షల చెక్కులను అందజేశారు.



ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ శాఖలో విధి నిర్వహణలో మృతి చెందిన సిబ్బంది కుటుంబాల సంక్షేమానికి పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు. మృతిచెందిన పోలీసు సిబ్బంది కుటుంబాలకు ప్రభుత్వం, పోలీస్ శాఖ ద్వారా అందాల్సిన సంక్షేమ ప్రయోజనాలు సకాలంలో అందేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటామని పేర్కొన్నారు. కుటుంబ సభ్యుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని వారికి అందాల్సిన మిగిలిన ప్రయోజనాలు కూడా త్వరితగతిన అందేలా సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకుని చర్యలు తీసుకుంటామని ఎస్పీ తెలిపారు. పోలీస్ సిబ్బంది కుటుంబాల సంక్షేమం పట్ల పోలీస్ శాఖ నిరంతరం బాధ్యతతో వ్యవహరిస్తుందని స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమంలో జిల్లా పోలీస్ కార్యాలయ ఏవో సాయికృష్ణ, ఆర్.ఐ వెంకట్, స్వాములు కుటుంబ సభ్యులు కళావతి, దన్‌రాజ్ రాథోడ్ భార్య భావన, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

టెన్నీకాయిట్ రాష్ట్రస్థాయి పోటీల్లో సత్తాచాటిన విద్యార్థులు

మక్తల్, నవంబర్ 2 (జనంసాక్షి): తెలంగాణ రాష్ట్ర టెన్నికాయిట్ అసోసియేషన్ ఆదేశాల మేరకు, హైదరాబాద్ జిల్లా టెన్నీకాయిట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నవంబర్ 1వ తేదీన హైదరాబాద్‌లోని అంబర్‌పేట ప్లే గ్రౌండ్‌లో రాష్ట్రస్థాయి జూనియర్ బాలబాలికల టెన్నీకాయిట్ పోటీలు ఘనంగా నిర్వహించారు. ఈ పోటీల్లో నారాయణపేట జిల్లా నుండి ప్రాతినిధ్యం వహించిన క్రీడాకారులు తమ అద్భుతమైన ప్రతిభను చాటి పలు స్థానాలను కైవసం చేసుకున్నారు. వివిధ విభాగాల్లో ప్రతిభ కనబరిచిన ఈ క్రీడాకారులకు హైదరాబాద్ అడిషనల్ ఎస్పీ నర్సయ్య, రాష్ట్ర టెన్నీకాయిట్ అసోసియేషన్ అధ్యక్షుడు రాకేష్ అగ్రవాల్, ఉపాధ్యక్షులు బి. గోపాలం, కోశాధికారి రాజు చేతుల మీదుగా ప్రశంసా పత్రాలు అందజేసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా అడిషనల్ ఎస్పీ నర్సయ్య



మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించడం ద్వారా ఉజ్వల భవిష్యత్తును సొంతం చేసుకోవచ్చని అన్నారు. ముఖ్యంగా విద్యార్థులు శ్రద్ధతో, ఇష్టపడి చదవడంతో పాటు క్రీడలపై కూడా దృష్టి పెట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ వైస్ చైర్మన్ సుశీల్ కుమార్, కార్యదర్శి సత్యనారాయణ, మద్దూర్ పీఈటీ మమత, ఊట్కూర్ పీఈటీ రమ్య, అరుణ, రాజు, సుధాగిరి, కురుమేశ్ తదితరులు పాల్గొన్నారు.

మల్లన్న సాగర్ బ్లాస్టింగ్‌ను ప్రశ్నించినందుకే ఫోన్ ట్యాపింగ్ కేసు తెరపైకి తెచ్చారు

కొండపాక, నవంబర్ 2 (జనంసాక్షి):
మల్లన్న సాగర్ వద్ద బ్లాస్టింగ్ ఘటనను ప్రశ్నించినందుకే ఫోన్ ట్యాపింగ్ కేసును తెరపైకి తెచ్చి ప్రభుత్వం డైవర్షన్ రాజకీయాలకు పాల్పడుతోందని రైతుబంధు సమితి మాజీ రాష్ట్ర కోఆర్డినేటర్ దేవి రవీందర్, మండల మాజీ కోఆర్డినేటర్ రాగళ్ల దుర్గయ్య ఆరోపించారు.
వెలికట్ట చౌరస్తాలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ..
అనుమతులు లేకుండా జరిగిన బ్లాస్టింగ్‌తో తిప్పారం గ్రామంలోని ఇళ్లకు పగుళ్లు వచ్చా యని తెలిపారు.
మల్లన్న సాగర్ ప్రాజెక్టును కాపాడి, బ్లాస్టింగ్‌కు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.
సమస్యలను పరిష్కరించకుండా ప్రతిపక్ష నేత లపై కేసులు పెట్టడం సరికాదన్నారు. కార్యక్ర మంలో బీఆర్ఎస్వీ అధ్యక్షుడు దుర్గాప్రసాద్, గాలి బాలయ్య, శివకుమార్ తదితరులు పాల్గొ న్నారు.

కల్లు తాగితే చెప్పుతో కొడతాం...

- 5000 రూపాయలు జరిమానా చెల్లించాల్సిందే

తూప్రాన్, నవంబర్ 2(జనంసాక్షి): మా ఊరిలో ఎవరైన కల్లు తాగితే చెప్పుతో కొడతాం 5000 జరిమా నా చెల్లించాలంటూ అంటూ బ్యానె ర్ ఏర్పాటు చేసిన ఘటన మనో హరబాద్ మండలం దండుపల్లిలో బ్యానర్ వెలిసింది.వివరాల ప్రకారం దండుపల్లి గ్రామంలో కల్లు దుకా ణం మొన్నటి వరకు సీసా ధర 15 రూపాయలు ఉండేది.ఇటీవల సీసా



ధర 20 రూపాయలు పెంచి అమ్మకాలు చేశారు. కల్లు సీసా ధర పెంచడంతో ఆగ్రహానికి గురైన గ్రామస్థులు ఎవరైనా పెంచిన రేటుకు కల్లు తాగితే 5 చెప్పు దెబ్బలు 5వేల రూపాయల జరి మానా విద్యుస్తామంటూ బ్యానర్లు ఏర్పాటు చేసి హెచ్చరించారు.

ఎండిన పంటల వివరాలు రైతులు నమోదు చేసుకోవాలి

వీపనగండ్ల, నవంబర్ 3 (జనంసాక్షి): మండలాన్ని ప్రభుత్వం కరువు మండలంగా ప్రకటించిన నేపథ్యంలో ఎండిపోయిన పంటల వివరాలను రైతులు వ్యవసాయ అధికారులకు అందించాలని మండల వ్యవసాయ అధికారి డాక్టర్ గౌడ్ సూచించారు. నీటి ఎద్దడి వల్ల



పంటలు ఎండిపోయిన రైతులు వెంటనే గ్రామ వ్యవసాయ విస్తరణ అధికారిని సంప్రదించాలన్నారు. రైతు పేరు, గ్రామం, పంట వివరాలు, సాగు విస్తీర్ణం, దెబ్బతిన్న పంట విస్తీర్ణం, ఫోన్ నంబర్‌తో పాటు పంట నష్టానికి సంబంధించిన ఫొటోలు అందించాలని తెలిపారు. అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి తదుపరి చర్యల కోసం నివేదికలు సమర్పిస్తారని పేర్కొన్నారు.

విద్యార్థినుల భద్రతపై అవగాహన కల్పించిన షీ టీమ్

- ZPHS బాలుర ఉన్నత పాఠశాలలో షీ టీమ్ ప్రత్యేక కార్యక్రమం



అచ్చంపేట, నవంబర్ 2 (జనంసాక్షి): విద్యార్థినుల భద్రత, మహిళల రక్షణ, వ్యక్తిగత భద్రతపై అవగాహన కల్పించేందుకు అచ్చంపేటలోని గ్లానూ బాలుర ఉన్నత పాఠశాలలో షీ టీమ్ ఆధ్వర్యంలో ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో షీ టీమ్ జిల్లా ఇన్‌చార్జి ఎస్ఐ ఇందిరా పాల్గొని విద్యార్థులకు మహిళల భద్రత, ఈవ్‌టీజింగ్, వేధింపుల నివారణ, అపరిచిత వ్యక్తుల పట్ల అప్రమత్తత వంటి అంశాలపై అవగాహన కల్పించారు. ఏదైనా సమస్య ఎదురైనప్పుడు భయపడకుండా పోలీసుల సహాయం తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ పద్మ, కానిస్టేబుల్ మల్లేష్, పాఠశాల ఇన్‌చార్జి హెచ్ ఎం లక్ష్మీబాయి, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయినులు పాల్గొన్నారు.

ఓటు హక్కును ప్రతి గ్రాడ్యుయేట్ వినియోగించుకోవాలి

- సింగల్ విండో డైరెక్టర్ ఏనుముల రాజేందర్ రెడ్డి



వెల్దండ, నవంబర్ 02 (జనంసాక్షి): ప్రతి గ్రాడ్యుయేట్ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సింగల్ విండో డైరెక్టర్ అనుముల రాజేందర్ రెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం వెల్దండ మండల తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ బి.కార్తీక్‌కుమార్‌కి గ్రాడ్యుయేట్ ఓటు నమోదు పత్రాలను అందజేశారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ... పట్టభద్రులైన ప్రతి ఒక్కరూ గ్రాడ్యుయేట్ ఓటరుగా నమోదు చేసుకోవడం తమ బాధ్యత అని, ప్రజాస్వామ్యంలో ఓటు చాలా విలువైనదని తెలిపారు. గ్రామంలోని అర్హులైన పట్టభద్రులందరూ ముందుకు వచ్చి తమ పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు.ఁ

గ్రాడ్యుయేట్ ఓటు నమోదుకు చివరి తేదీ 06/11/2026 లోపు అర్హులందరూ దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు వార్డ్ సభ్యులు రాఘవరెడ్డి రేవల్లి రాజు దేవేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లిఫ్ట్ ఇరిగేషన్ పరికరాల చోరీకి యత్నం.. ఇద్దరు పట్టివేత

ఈ ఘటనపై లిఫ్ట్ ఇరిగేషన్ ఏఈ జాషువా ఇచ్చిన ఫిర్యాదు మేరకు జావేద్, గోపాల్ అనే ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రామన్ గౌడ్ తెలిపారు. మరోవైపు, లిఫ్ట్ ఇరిగేషన్ పథకాలు చాలా కాలంగా నిరుపయోగంగా ఉండటం, నిర్వహణ లేకపోవడం వల్ల ఇలాంటి చోరీ ఘటనలకు అవకాశం ఏర్పడుతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

750 ఎకరాలకు సాగునీరు అందించాల్సిన లిఫ్ట్ ఇరిగేషన్ వ్యవస్థ నిరుపయోగంగా ఉండటంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొంటున్నారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి లిఫ్ట్ ఇరిగేషన్ పనులను పునరుద్ధరించి, రైతులకు అందుబాటులోకి తీసుకురావాలని గ్రామ రైతులు కోరుతున్నారు. సాగునీటి వసతిని కాపాడటంతో పాటు పరికరాలకు భద్రత కల్పించే చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

తీవ్ర దుర్భిక్షం... ఆదుకోవాలి తక్షణం: సిపిఐ



వనపర్తి బ్యూరో, నవంబర్ 2 (జనంసాక్షి): వనపర్తి జిల్లాలో తీవ్ర దుర్భిక్షం నెలకొందని వెంటనే సహాయక చర్యలు ప్రారంభించి రైతు కూలీలను ఆదుకోవాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు బాల నరసింహ డిమాండ్ చేశారు. సోమవారం వనపర్తి మండలం అంజనగిరి, దత్తాయిపల్లి, దత్తాయిపల్లి తండాలో సిపిఐ బృందం పర్యటించగా తీవ్ర దుర్భిక్ష పరిస్థితులు కళ్ళకు కట్టాయి అన్నారు. అంజనగిరికి కాసింనగర్ లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా సాగునీరు అందిస్తాం అన్న హామీని పాలకులు నెరవేర్చలేదన్నారు. బోర్లపై ఆధారపడి సాగు చేయటంతో సుమారు 100 ఎకరాల్లో వరి పంటలు ఎండిపోయాయన్నారు. పెద్ద దేవన్న రైతు నాలుగు ఎకరాల్లో వేసిన వారిపై రెండు తడులు ఇస్తే పండేదని, బోర్ లో నీళ్లు ఆగిపోవడంతో పంట ఎండిపోయిందన్నారు.

మరో రైతు పొలం కరిగేట చేశారని మరు రోజు నాటేందుకు ప్రయత్నించగా బోరు ఎండిపోయిందని, ఆశతో రూ.1,60,000 ఖర్చుపెట్టి రెండు బోర్లు తవ్విన నీళ్లు పడకపోవడంతో తీవ్రంగా నష్టపోయారని చాలామందిది ఇదే పరిస్థితి అన్నారు. దత్తాయిపల్లి, దత్తాయిపల్లి తండాలో సాగుచేసిన వరి పైరులు 80% ఎండిపోయాయన్నారు. సాగుకు అప్పులు తెచ్చామని పంట పండక పోవడంతో ఎలా తీర్చాలని ఆందోళన పడుతున్నారన్నారు. కేఎల్ఐ కాల్వ ఉందని పంట వేశారని సాగునీళ్లు రాకపోవడంతో ఎండిపోయాయన్నారు. పశువులు గొర్రెలకు మనుషులకు తాగునీటి సమస్య ఏర్పడే పరిస్థితి ఉందన్నారు. పంటలు ఎండి ప్రతి రైతు కంట్లో దుఃఖం కనిపిస్తోందన్నారు. జూన్ నెల వరకు ప్రతి నెల ప్రతి కుటుంబానికి రూ. 15000 ఇవ్వాలన్నారు. ఎండిన పంటలకు ఎకరాకు రూ.30000 నష్టపరిహారం ఇవ్వాలని, పంట రుణాలు మాఫీ చేయాలన్నారు. రేషన్ దుకాణాల ద్వారా పేదలకు మనిషికి 15 కిలోల బియ్యం ఇవ్వాలన్నారు. ఉపాధి హామీ పనులను విస్తృతంగా చేపట్టి కూలీలకు 200 రోజులు పని కల్పించాలని, కూలి రూ.600 ఇవ్వాలని డిమాండ్ చేశారు. మూగ జీవాలను కాపాడుకునేందుకు ఉచితంగా పశుగ్రాసం ఇవ్వాలని, పశుగ్రాస కేంద్రాలను ఏర్పాటు చేయాలన్నారు.

పిల్ల కాలువలు నిర్మించక సాగునీటి ఇబ్బంది...

ఉమ్మడి జిల్లాలో ప్రధాన సాగునీటి ప్రాజెక్టులు కేఎల్ఐ జూరాల భీమా తదితర ప్రాజెక్టుల ప్రధాన కాలువల నుంచి పిల్ల కాలువలు నిర్మించకపోవడంతో చివరి పొలాలకు సాగునీరు అందక ఎండిపోయాయన్నారు.

పిల్ల కాలువల కోసం వెంటనే భూసేకరణ చేపట్టి కాల్వలు నిర్మించాలన్నారు. సిపిఐ జిల్లా కార్య దర్శి విజయరాములు, సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి రమేష్, జిల్లా కార్యవర్గ సభ్యుడు శ్రీరామ్, జె. చంద్రయ్య నేతలు పృథ్వినాదం, చిన్న కుర్మయ్య, శివ, కాంగ్రెస్ నేత అంజనగిరి మాజీ సర్పంచ్ నారాయణ, పలువురు రైతులు కరువు పరిస్థితులను బృందానికి వివరించారు. తదితరులు పాల్గొన్నారు.

నిజాంపేట్ గిరిజన బాలికలకు గురుకులంలో ప్రవేశాలు

- దరఖాస్తుకు చివరి తేదీ నవంబర్ 12



నిజాంపేట్, నవంబర్ 02 (జనంసాక్షి): తెలంగాణ గిరిజన సంక్షేమ మినీ గురుకులం (బాలికలు), కస్తూర్బా బాచేపల్లి గ్రామం, నిజాంపేట్ మండలం, సంగారెడ్డి జిల్లాలో 2026-27 విద్యా సంవత్సరానికి సంబంధించి 5వ తరగతిలో 20 సీట్లు ఖాళీగా ఉన్నాయని ప్రిన్సిపాల్ కవిత తెలిపారు. ఈ ఖాళీ సీట్ల భర్తీకి గిరిజన బాలికల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ ప్రవేశాలు ఇంగ్లీష్ మీడియం సిలబస్ లో నిర్వహించబడుతాయని తెలిపారు. ఆసక్తి గల ST అభ్యర్థులు తమ దరఖాస్తులను సంబంధిత పాఠశాలలోని హెడ్ మిస్ట్రెస్ గారికి (సంప్రదించవలసిన నెం: 9951099174) నేరుగా 12/11/2026 వరకు సంప్రదించవలెనని సూచించారు.

ఈ ప్రవేశాలకు 11 సంవత్సరాల వయస్సు గల గిరిజన బాలికలు ఎస్ టి బాలికలు అర్హులని, నిజాంపేట్ మండలానికి చెందిన విద్యార్థులకు మొదటి ప్రాధాన్యత ఇవ్వబడుతుందని తెలిపారు. ఎంపికైన విద్యార్థులకు ఉచిత భోజనం, వసతి, నోటు పుస్తకాలు, పడక సామాగ్రి తదితర సదుపాయాలు పూర్తిగా ఉచితంగా అందించబడతాయని ప్రిన్సిపాల్ తెలిపారు.

నేడు విద్యుత్తు వినియోగదారుల దినోత్సవం...

- విద్యుత్తు శాఖ ఏఈ హైమద్ హలీ



కొల్చారం, నవంబర్ 02 (జనంసాక్షి): నర్సాపూర్ డివిజన్ లో విద్యుత్తు వినియోగదారుల సమస్యలను పరిష్కరించేందుకు నేడు విద్యుత్తు వినియోగదారుల దినోత్సవం (కన్సూమర్స్ డే) నిర్వహిస్తున్నట్లు విద్యుత్తుశాఖ ఏఈ హైమద్ అలీ తెలిపారు. రైతులకు, గృహావసర విద్యుత్తు వినియోగదారులకు ధీర్ఘకాలికంగా విద్యుత్తు సమస్యలు ఏమైనా ఉన్నా మీటర్లు అధిక బిల్లులు వచ్చిన తదితర సమస్యలను నేరుగా సబ్ డివిజనల్ నర్సాపూర్ కార్యాలయంలో ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు నిర్వహించే వినియోగదారుల దినోత్సవ ప్రత్యేక కార్యక్రమానికి వచ్చి తమ సమస్యలను తెలియజేస్తే వాటిని పరిష్కరించడం జరుగుతుందని ఏఈ తెలిపారు. దీంతో పాటు విద్యుత్తు వినియోగదారులకు సంబంధించి ఎలాంటి సమస్యలు ఉన్నా అధికారులు, సిబ్బంది అందుబాటులో ఉండి వాటిని పరిష్కరించేలా అవసరమైన చర్యలు తీసుకుంటారని పేర్కొన్నారు. విద్యుత్తు వినియోగదారులు, రైతులు నేడు నిర్వహించే వినియోగదారుల దినోత్సవాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఏఈ కోరారు.

పేదలకు అండగా ముఖ్యమంత్రి సహాయ నిధి



నంగునూరు, నవంబర్ 2 (జనంసాక్షి): ముఖ్యమంత్రి సహాయ నిధి పేద కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పిస్తోందని ఏఎంసీ వైస్ చైర్మన్ సాదుల పవన్ కుమార్ అన్నారు. నంగునూరు గ్రామానికి చెందిన కొండిల స్రవంతి భర్త వెంకటేష్‌కు మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కును సోమవారం అందజేశారు. మంత్రులు గడ్డం వివేక్ వెంకటస్వామి, పొన్నం ప్రభాకర్, నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ సహకారంతో ఆర్థిక సాయం మంజూరైందని తెలిపారు. అర్హులైన పేదలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ డైరెక్టర్లు, పీఏసీఎస్ డైరెక్టర్, కాంగ్రెస్ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

అమిత్ షా పాదయాత్రకు భారీగా తరలిన నాయకులు



అమీన్పూర్, నవంబర్ 2 (జనంసాక్షి): హైదరాబాద్ నగరంలో సోమవారం భారతీయ జనతా పార్టీ కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా సమక్షంలో తలపెట్టిన మహా పాదయాత్ర కార్యక్రమానికి అమీన్పూర్ మండలం నుంచి భాజాపా శ్రేణులు తరలి వెళ్లారు. బీరంగూడ డివిజన్ అధ్యక్షుడు ఈర్ల రాజు ఆధ్వర్యంలో, అమీన్పూర్‌లో కొత్తపల్లి రమేష్ ఆధ్వర్యంలో కార్యకర్తలు ప్రత్యేక బస్సుల్లో నగరానికి తరలి వెళ్లారు.

నీరు, విద్యుత్‌ను పొదుపుగా వినియోగించుకోవాలి

- ఆరుతడి పంటల సాగుపై రైతులకు అవగాహన..
- గోకుల్ నగర్‌లో తెలంగాణ సాంస్కృతిక సారథి కళాబృందం ప్రచారం



కొత్తపల్లి నవంబర్ 2 (జనంసాక్షి): నారాయణపేట జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు, జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి (డీపీఆర్ఓ) ఆధ్వర్యంలో తెలంగాణ సాంస్కృతిక సారథి కళాబృందం ఉమ్మడి మద్దూరు మండల పరిధిలోని గోకుల్ నగర్ గ్రామంలో ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించింది.

ఎల్‌నినో ప్రభావంతో రానున్న రోజుల్లో కరువు పరిస్థితులు ఏర్పడే అవకాశాలు ఉన్న నేపథ్యంలో నీరు, విద్యుత్‌ను ప్రతి ఒక్కరూ పొదుపుగా వినియోగించుకోవాలని కళాకారులు సూచించారు. రైతులు నీటి లభ్యతను బట్టి వరి పంటకు బదులుగా ఆరుతడి పంటల సాగుకు ప్రాధాన్యత ఇవ్వాలని పిలుపునిచ్చారు.

మాటలు, పాటల ద్వారా నీటి సంరక్షణ, విద్యుత్ పొదుపు, ప్రత్యామ్నాయ పంటల సాగుపై ప్రజలకు అవగాహన కల్పించారు. భవిష్యత్తులో నీటి ఎద్దడి సమస్యలు తలెత్తకుండా ఇప్పటి నుంచే నీటిని బాధ్యతగా వినియోగించుకోవాలని కోరారు.

రెండో వార్డులో తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు

• **నూతన బోరు నుంచి పైప్‌లైన్ ఏర్పాటు**

వనపర్తి బ్యూరో, నవంబర్ 2 (జనంసాక్షి): వనపర్తి మున్సిపాలిటీ పరిధిలోని స్థానిక రెండో వార్డులో ప్రజల తాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకొని స్థానిక ప్రజాప్రతినిధులు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. వార్డులో తాగునీటి సమస్యను పరిష్కరించే లక్ష్యంతో ఇటీవల నూతన బోర్లు వేయించడం జరిగింది. ఈ బోర్ల ద్వారా ప్రజలకు నిరంతరాయంగా తాగునీరు అందించేందుకు ఒక ఇంచు వాటర్ పైప్‌లైన్ ఏర్పాటు పనులను చేపట్టారు. ఈ పనుల కోసం మున్సిపాలిటీ జనరల్ ఫండ్ నిధుల నుంచి లక్ష రూపాయలు కేటాయించి పనులు నిర్వహిస్తున్నారు. ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించడమే లక్ష్యం గా ఈ అభివృద్ధి పనులు చేపట్టడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా వేసవికాలంలో తాగునీటి ఇబ్బందులు ఎదుర్కొనే కుటుంబాలకు ఈ బోర్లు, పైప్‌లైన్ ఏర్పాటు ఎంతో ఉపయోగకరంగా ఉండనున్నాయి. ఈ అభివృద్ధి పనులను స్థానిక కౌన్సిలర్ బి.రమాదేవి కృష్ణ స్వయంగా పరిశీలించారు. పనుల నాణ్యత, పైప్‌లైన్ ఏర్పాటు విధానం, ప్రజలకు నీటి సరఫరా సక్రమంగా జరిగేలా తీసుకోవాల్సిన చర్యలపై సంబంధిత సిబ్బందికి సూచనలు చేశారు.

ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ బి.కృష్ణ పాల్గొని పనులను పరిశీలించారు. వార్డులో ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యతనిస్తూ అభివృద్ధి కార్యక్రమా



లను కొనసాగిస్తామని నాయకులు పేర్కొన్నారు. ప్రజల అవసరాలను గుర్తించి నిధులను సద్వినియోగం చేస్తూ అభివృద్ధి పనులు చేపట్టడం అభినందనీయమని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. బోరు నుంచి పైప్‌లైన్ ద్వారా ప్రతి ఇంటికీ తగినంత నీరు అందేలా చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

చినజీయర్ స్వామి
ముహూర్తంతోనే ధ్వజస్తంభ ప్రతిష్టాపన



జడ్చర్ల, నవంబర్ 2 (జనంసాక్షి): బాదేపల్లి పెద్దగుట్టపై శ్రీ రంగనాయక స్వామి ఆలయంలో ధ్వజస్తంభ ప్రతిష్టాపన ఉత్సవాల నిలిపివేతపై ఆలయ ట్రస్టు సభ్యుడు కాల్వ రాంరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ త్రిదండి చినజీయర్ స్వామి నిర్ణయించిన ముహూర్తం, వేద పండితుల సూచనల మేరకే ఉత్సవాలు ప్రారంభించామన్నారు. భక్తుల సహకారంతో 22 అడుగుల రాతి ధ్వజస్తంభాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అయితే ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి కారణంగా ఉత్సవాలు నిలిచిపోయాయని ఆరోపించారు. హోమ పూజల సమయంలో అధికారులు వచ్చి కార్యక్రమాలను అడ్డుకోవడం బాధ కలిగించిందన్నారు. ఆలయ అభివృద్ధి కార్యక్రమాలకు రాజకీయాలు అడ్డుకాకూడదని పేర్కొన్నారు.

రాష్ డ్రైవింగ్ పై
అవగాహన కోసం షార్ట్ ఫిల్మ్

• **కడవేరుగులో ప్రారంభోత్సవం**



చేర్యాల, నవంబర్ 02(జనంసాక్షి): చేర్యాల మండలం కడవెరుగు గ్రామంలో గ్రామ పంచాయతీ చౌరస్తా వద్ద రాష్ డ్రైవింగ్ పై అవగాహన కల్పించే షార్ట్ ఫిల్మ్ ప్రారంభోత్సవం సోమవారం ఘనంగా జరిగింది. పిల్లలు రాష్ డ్రైవింగ్ చేయడం వల్ల ఎదురయ్యే పరిణామాలపై అవగాహన కల్పించే ఉద్దేశంతో గ్రామానికి చెందిన గర్నపల్లి నరేష్ ఆధ్వర్యంలో ఈ షార్ట్ ఫిల్మ్ ను చిత్రీకరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ తాళ్లపల్లి రమేష్ గుప్తా, ఉప సర్పంచ్ జంగా సురేందర్, వార్డు సభ్యులు పిల్లి శ్రీనివాస్, తుమ్మ కృష్ణ, గ్రామస్తులు పాల్గొన్నారు.

గ్రామసమైక్య భవనాన్ని శంకుస్థాపన చేసిన ఎంపీడీవో

నిజాంపేట్, నవంబర్ 02 (జనంసాక్షి): నిజాంపేట్ మండలంలోని జంబికుంట గ్రామ పంచాయతీ పరిధిలో సోమవారం గ్రామ సమైక్య భవన నిర్మాణానికి శంకుస్థాపన ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీడీవో సంగ్రామ్ శంకుస్థాపన చేసి మాట్లాడుతూమహిళా సాధికారతే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం మహిళా సంఘాలకు అధిక ప్రాధాన్యత ఇస్తోందని అన్నారు. ప్రతి గ్రామంలో గ్రామ సమైక్య భవనం ఉండటం వల్ల మహిళలు తమ పొదుపు, సంఘ సమావేశాలు, అన్ని రకాల అభివృద్ధి కార్యక్రమాలు సొంత భవనంలో నిర్వ





హించుకునే అవకాశం కలుగుతుందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం మహిళల ఆర్థికాభివృద్ధికి అనేక పథకాలు ప్రవేశపెట్టిందని, వాటిని మహిళా సంఘాలు సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ఎదగాలని పిలుపునిచ్చారు. త్వరలోనే భవన నిర్మాణాన్ని పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ తనయుడు కృష్ణ, ఉప సర్పంచ్ రఘుపతి రెడ్డి, తహసిల్దార్ నాగజ్యోతి, ఏఈ విద్యాసాగర్ రావు, మండల మహిళా సమాఖ్య సభ్యులు, స్వయం సహాయక సంఘాల మహిళలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

కల్వకుర్తిలో
ఇద్దరు సెల్‌ఫోన్ దొంగల అరెస్టు


• **ఐదు ఫోన్లు,కారు స్వాధీనం.. ఎస్ఐ కురుమూర్తి**



కల్వకుర్తి, నవంబరు 2 (జనంసాక్షి): కల్వకుర్తి బస్‌స్టాండ్‌లో గత కొన్ని రోజులుగా సెల్‌ఫోన్ల దొంగతనాలకుపాల్పడుతున్నఇద్దరు యువకులను పోలీసులు అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి ఐదు సెల్‌ఫోన్లతో పాటు ఒక కారును స్వాధీనం చేసుకున్నారు. అనంతరం నిందితులను న్యాయస్థానంలో హాజరుపరిచి, రిమాండ్‌కు తరలించారు. ఈ విషయాన్ని కల్వకుర్తి ఎస్ఐ కురుమూర్తి వెల్లడించారు.

మాజీ సైనికుడి సాహసం..

• **'ఐరన్ మాన్' టైటిల్ సాధించిన నాగపూర్ కృష్ణయ్య**



రేవల్లి, నవంబర్ 02 (జనంసాక్షి): వయసు కేవలం ఒక సంఖ్య మాత్రమేనని నిరూపిస్తూ, వనపర్తి జిల్లా రేవల్లి మండలం నాగపూర్ గ్రామానికి చెందిన మాజీ సైనికుడు కర్వాంగ కృష్ణయ్య అరుదైన ఘనత సాధించారు. గోవా వేదికగా జరిగిన అత్యంత కఠినమైన ఐరన్ మ్యాన్ 70.3 ఈవెంట్‌ను 50 ఏళ్ల వయసులోనూ విజయవంతంగా పూర్తి చేసి ఆయన 'ఐరన్ మాన్' టైటిల్ దక్కించుకున్నారు.

మూడు కఠిన పరీక్షలు...

ఈ ఈవెంట్ లో భాగంగా సముద్రంలో 1.9 కి.మీ. ఈత, 90 కి.మీ. సైక్లింగ్, 21.1 కి.మీ. రన్నింగ్... ఇలా మూడు కఠినమైన విభాగాలను నిర్ణీత సమయంలో పూర్తి చేయాల్సి ఉంటుంది. ఎంతో కఠినమైన ఈ సవాల్ ను కృష్ణయ్ అధిగమించారు. కాగా కృష్ణయ్య ప్రస్తుతం రిజర్వ్ బ్యాంక్ ఉద్యోగిగా విధులు నిర్వహిస్తున్నారు.

సూపర్ రెండ్యూనర్ టైటిల్ కూడా...

గతంలోనూ అసాధారణ ప్రతిభ చూపిన కృష్ణయ్య, ఆడాక్స్ ఇండియా ఆధ్వర్యంలో ఏడాదిలో పూర్తి చేయాల్సిన దీ=వీ సైక్లింగ్ ఈవెంట్లను (200, 300, 400, 600 కి.మీ.) కేవలం ఒక్క నెల లోనే పూర్తి చేసి సూపర్ రెండ్యూనర్ అంతర్జాతీయ టైటిల్ ను కూడా సాధించారు. ఫిజికల్ యాక్టివిటీ నేపథ్యం పెద్దగా లేక పోయినా, పట్టుదల, క్రమశిక్షణతో ఇంతటి పెద్ద విజయాలు సాధించి ఎంతోమందికి స్ఫూర్తిగా నిలుస్తున్న కృష్ణయ్యను స్థానికులు, క్రీడాభిమానులు, మాజీ సైనికులు అభినందిస్తున్నారు. ఇలాంటి క్రీడాకారులను ప్రభుత్వం గుర్తించి ప్రోత్సహించాలని కోరుతున్నారు.

ఎల్‌నినో పై విద్యార్థులకు సూచనలు చేసిన డీఈఓ

రాజాపూర్, నవంబర్ 2 (జనంసాక్షీ): జిల్లాలోని 1,108 పాఠశాలల్లో ఎల్‌నినోపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా ఆదేశాల మేరకు మహబూబ్‌నగర్ జిల్లాలోని 1,108 ప్రభుత్వ పాఠశాలల్లో సోమవారం ఉదయం ప్రార్థనా సమయంలో ఎల్‌నినో ప్రభావాలు, వాతావరణ మార్పులు, వాటిని ఎదుర్కొనేందుకు తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలపై విద్యార్థులకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు.

ఈ సందర్భంగా ఎండ తీవ్రత పెరగడం, వర్షపాతంలో మార్పులు, నీటి కొరత వంటి పరిస్థితుల గురించి విద్యార్థులకు వివరించారు. నీటిని వృథా చేయకుండా పొదుపుగా వినియోగించడం, తగినంత నీరు తాగడం, ఎండ తీవ్రత అధికంగా ఉన్న సమయంలో బయట



తిరగకుండా జాగ్రత్తలు పాటించడం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో భాగంగా జిల్లా విద్యాశాఖ అధికారి ఐ.విజయకుమారి రాజాపూర్ మండల కేంద్రంలోని పాఠశాలను ఆకస్మికంగా సందర్శించి, ఉదయం ప్రార్థనా సమయంలో విద్యార్థులతో మాట్లాడి ఎల్‌నినో ప్రభావాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. అనంతరం



కాంప్లెక్స్ సమావేశంలో పాల్గొని పర్యావరణ పరిరక్షణ, నీటి పొదుపు, వాతావరణ మార్పులపై విద్యార్థుల్లో అవగాహన పెంపొందించేలా ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఇఓ సుధాకర్, ప్రధానోపాధ్యాయుడు సయ్యిద్ ఇబ్రహీం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రెండు రోజులు భారీ వర్షాలు
ప్రజలు జాగ్రత్తగా ఉండాలి: తహసీల్దార్ ఖాజా మొయినుద్దీన్

వీపనగండ్ల, నవంబర్ 2 (జనంసాక్షి) మురాసు తుపాను ప్రభావంతో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున మండల ప్రజలు,రైతులు అప్రమత్తంగా ఉండాలని వీపనగండ్ల తహసీల్దార్ ఖాజా మొయినుద్దీన్ సూచించారు. భారత వాతావరణ శాఖ హెచ్చరికల మేరకు నవంబర్ 2వ తేదీ ఉదయం 8.30 గంటల నుంచి నవంబర్ 3వ తేదీ ఉదయం 8.30 గంటల వరకు ఆరెంజ్ అలర్ట్, నవంబర్ 3, 4 తేదీల్లో ఎల్లో అలర్ట్ జారీ చేసినట్లు తెలిపారు. తుపాను ప్రభావంతో గంటకు 60 నుంచి 90 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసే ప్రమాదం



ఉందని అన్నారు. ప్రజలు అత్యవసరమైతే తప్ప బయటకు వెళ్లవద్దని, చెట్లు, విద్యుత్ స్తంభాలు, హోర్డింగ్‌ల కింద నిలబడరాదని సూచించారు. పిడుగులు పడే సమయంలో బహిరంగ ప్రదేశాలకు దూరంగా ఉండాలని, రైతులు వ్యవసాయ పనుల్లో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, పశువులను సురక్షిత ప్రాంతాల్లో ఉంచాలని కోరారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, వాగులు, వరద నీరు ప్రవహించే ప్రాంతాలను దాటేందుకు ప్రయత్నించరాదని హెచ్చరించారు. సంబంధిత శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండి ప్రజలకు అవసరమైన సహాయ సహకారాలు అందించాలని సూచించారు. వాతావరణశాఖ సూచనలు పాటిస్తూ ప్రజలందరూ సురక్షితంగా ఉండాలని మండల ప్రజలు,రైతులకు తహసీల్దార్ ఖాజా మొయినుద్దీన్ సూచనలు చేశారు.

కొల్చారం ప్రజావాణిలో ఫిర్యాదులు నిల్



కొల్చారం, నవంబర్ 02 (జనంసాక్షి): కొల్చారం మండల కేంద్రంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో ఎలాంటి ఫిర్యాదులు అందలేదని ఎంపీడీవో రఫీక్ ఉన్నిసా తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1:00 వరకు కార్యక్రమం నిర్వహించామని తెలిపారు. ప్రజలు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చి ప్రజావాణి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో సూచించారు.

కొనుగోలు కేంద్రాలతోనే

రైతులకు లాభం: ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి



శివ్వంపేట, నవంబర్ 2 (జనంసాక్షి): ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారానే రైతులకు మేలు జరుగుతుందని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని చెన్నాపూర్, చిన్నగొట్టిముక్ల, తిమ్మాపూర్, పిల్లుట్ల, ఎదుల్లాపూర్ గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు దళారులకు ధాన్యం విక్రయించి నష్టపోవద్దని సూచించారు. కొనుగోళ్లలో తూకం విషయంలో అవకతవకలు జరగకుండా చూడాలని, కేంద్రాల్లో రైతులకు అన్ని సౌకర్యాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు.

ఏ గ్రేడ్ ధాన్యానికి క్వింటాల్‌కు రూ.2,461, బీ గ్రేడ్‌కు రూ.2,441 మద్దతు ధరతో పాటు సన్న వడ్లకు రూ.500 బోనస్ అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

ప్రజావాణిలో తొమ్మిది దరఖాస్తుల పరిష్కారం



చిన్న శంకరంపేట, నవంబర్ 2 (జనంసాక్షి): ప్రజావాణిలో ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తులను సంబంధిత శాఖలకు పంపించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు ఎంపీడీవో దామోదర్ తెలిపారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో మొత్తం 15 దరఖాస్తులు స్వీకరించగా, తొమ్మిదింటిని పరిష్కరించినట్లు పేర్కొన్నారు. మిగిలిన ఆరు దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని, ముఖ్యంగా భూ సమస్యలను సంబంధిత శాఖలకు పంపించినట్లు తెలిపారు. పెండింగ్ దరఖాస్తులను త్వరగా పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. మండల ప్రజలు తమ సమస్యలపై మండల కేంద్రంలోనే దరఖాస్తు చేసుకుంటే త్వరితగతిన పరిష్కారం లభించే అవకాశం ఉంటుందని ఎంపీడీవో సూచించారు.

ఖేలో ఇండియా ఖో-ఖో శిక్షణ శిబిరాన్ని విజయవంతం చేయండి

మక్తల్, నవంబర్ 02 (జనంసాక్షి):
రాష్ట్ర క్రీడాశాఖ మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి ఆదేశాల మేరకు, మక్తల్ పట్టణంలోని క్రీడా మైదానంలో ఖేలో ఇండియా ఖో-ఖో శిక్షణ శిబిరాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మక్తల్ మున్సిపల్ చైర్మన్ వాకిటి మానస హనుమంతు, 16వ వార్డు కౌన్సిలర్ పావని హజరారయ్యారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి శిబిరాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ఖేలో ఇండియా కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న ఈ శిక్షణ శిబిరంలో తెలంగాణ జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్న క్రీడాకారులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి విజేతలుగా నిలవాలని జిల్లా యువజన, క్రీడల అధికారి వెంకటశెట్టి ఆకాంక్షించారు. ?క్రీడాకారులు క్రమశిక్షణ, పట్టుదల, నిరంతర సాధనతో తమ నైపుణ్యాలను మరింత మెరుగుపరుచుకోవాలని ఆయన సూచించారు.

కేవలం రాష్ట్ర స్థాయిలోనే కాకుండా, జాతీయ స్థాయిలో కూడా రాణించి రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని పిలుపునిచ్చారు. క్రీడాకారులకు అవసరమైన శిక్షణ, పూర్తి ప్రోత్సాహాన్ని అందించేందుకు క్రీడా శాఖ నిరంతరం కృషి చేస్తోందని, క్రీడాకారులు ఈ చక్కటి అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ సత్తా చాటాలని ఆయన కోరారు.

ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు ఏ. రవికుమార్, ఏఎంసీ వైస్ చైర్మన్ బి. గణేష్ కుమార్, మాజీ



ఉపసర్పంచ్ కట్ట సురేష్, కోళ్ల వెంకటేష్, కౌన్సిలర్ రహీం పటేల్, నీలప్ప ముదిరాజ్, నీలా గౌడ్, ఆర్ఎంపీ శంకర్, ఏఎంసీ డైరెక్టర్ ఫయాజ్, మంజూరు ఇలాహి, వివిధ పాఠశాలల పీడీలు కోచ్‌లు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్


చేర్యాల పట్టణ అధ్యక్షుడిగా మహేష్ మాదిగ



చేర్యాల, నవంబర్ 2 (జనంసాక్షి): ఎమ్మార్పీఎస్ చేర్యాల పట్టణ అధ్యక్షుడిగా గంధమాల మహేష్ మాదిగ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సోమవారం జరిగిన కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు దేవులపల్లి రాజేందర్ మాదిగ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భూమిగారి రాజేందర్ మాదిగ నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మహేష్ మాట్లాడుతూ మాదిగ, ఉపకులాలను ఏకతాటిపైకి తీసుకొచ్చి వారి అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. మాదిగలకు రావాల్సిన హక్కులు, వాటా కోసం పోరాడుతానని తెలిపారు. కార్యక్రమంలో పలువురు ఎమ్మార్పీఎస్ నాయకులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్లో

నాణ్యతా ప్రమాణాలు పాటించాలి



కోహీర్, నవంబర్ 2 (జనంసాక్షి): మండలంలోని పీచరాగడి పాత తండాలో ఎంపీడీవో ఉమాదేవి పర్యటించి గ్రామంలో చేపడుతున్న అభివృద్ధి పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా పనుల పురోగతిని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం కేటాయించిన నిధులను సద్వినియోగం చేసుకోవాలని, ప్రతి పనిలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని అధికారులకు సూచించారు. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం పనులను పారదర్శకంగా నిర్వహిస్తూ, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీవో కృష్ణయ్య, పంచాయతీ కార్యదర్శులు అక్తర్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఈ నెల 4న సిర్గాపూర్

మండల సర్వసభ్య సమావేశం



సిర్గాపూర్, నవంబర్ 2 (జనంసాక్షి): మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 4వ తేదీ బుధవారం ఉదయం 11 గంటలకు సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో అండాలమ్మ తెలిపారు. మండల ప్రత్యేక అధికారి అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి అన్ని శాఖల అధికారులు తమ ప్రగతి నివేదికలు, పూర్తి సమాచారంతో సకాలంలో హాజరు కావాలని ఆదేశించారు. మండలంలోని సర్పంచులు,ప్రజాప్రతినిధులు తప్పనిసరిగా హాజరై సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు.

ఎల్‌నినో ప్రభావంతో

ఆరుతడి పంటల సాగుకు ప్రాధాన్యత ఇవ్వాలి

• మండల వ్యవసాయ అధికారి శ్వేతకుమారి



కొల్చారం, నవంబర్ 2 (జనంసాక్షి):
ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశాలున్నందున రైతులు ఆరుతడి పంటల సాగుపై దృష్టి సారించాలని మండల వ్యవసాయ అధికారి శ్వేతకుమారి సూచించారు. సోమవారం నిర్వహించిన అభియాన్ కార్యక్రమంలో రైతులకు అవగాహన కల్పించారు. జొన్న, మొక్కజొన్న, కుసుమ, పొద్దుతిరుగుడు వంటి పంటల సాగుతో నీటి వినియోగాన్ని తగ్గించుకోవచ్చని తెలిపారు. పచ్చిరొట్ట పంట



లు, జీవ ఎరువులు, సూక్ష్మ పోషకాల వినియోగంతో భూసారాన్ని కాపాడుకోవాలని సూచించారు. మట్టి నమూనాల సేకరణ, భూసార పరీక్షల ప్రయోజనాలను వివరించారు. పరీక్షల ఫలితాల ఆధారంగా పంటలకు అవసరమైన పోషకాలు అందించాలని తెలిపారు. శాస్త్రీయ సాగు పద్ధతులతో పెట్టుబడి ఖర్చులు తగ్గించుకుని అధిక దిగుబడులు సాధించాలని రైతులకు సూచించారు.

ఈ కార్యక్రమంలో కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ ఎం.ప్రతాపరెడ్డి, వ్యవసాయ విస్తరణ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

పరిశుభ్రమైన తాగునీటికి ఐక్యత ఫౌండేషన్ కృషి

• పంజూగులలో స్వచ్ఛ జలధార కార్యక్రమం..నీటి నిల్వ ట్యాంకుల శుభ్రత



కల్వకుర్తి, నవంబరు 2 (జనంసాక్షి): ప్రజలకు పరిశుభ్రమైన తాగునీటిని అందించాలనే లక్ష్యంతో ఐక్యత ఫౌండేషన్ చేపట్టిన స్వచ్ఛ జలధార కార్యక్రమంలో భాగంగా సోమవారం కల్వకుర్తి మండలం పంజూగుల గ్రామంలో తాగునీటి నిల్వ ట్యాంకులను శుభ్రం చేశారు. ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డిరాఘవేందర్ రెడ్డి సహకారంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.మూడో విడతలో భాగంగా జర్మన్ సాంకేతికతతో కూడిన ప్రత్యేక యంత్రాల సాయంతో ట్యాంకుల్లో పేరుకుపోయిన మురికి,వ్యర్థాలను శాస్త్రీయ పద్ధతిలో తొలగించి శుభ్రపరిచారు.తాగునీటి నాణ్యతను మెరుగుపరచడంతో పాటు ప్రజల ఆరోగ్యాన్ని కాపాడేందుకు కల్వకుర్తి నియోజకవర్గంలోని గ్రామాల్లో ఈ కార్యక్రమాన్ని దశలవారీగా కొనసాగించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈకార్యక్రమంలో పంజూగుల సర్పంచి పరుశరాములు, ఉపసర్పంచి శ్రీనివాస్ గౌడ్, ఐక్యత ఫౌండేషన్ ప్రతినిధులు, వార్డు సభ్యులు రామకృష్ణ, అనంత, భాస్కర్, లక్ష్మణ్, యువకులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండీ...



పాపన్నపేట, నవంబర్ 2 (జనంసాక్షి): పాపన్నపేట మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమం సాదాసీదాగా జరిగింది. కుర్తివాడలో మురుగు కాలువ సమస్య,కొత్త లింగాయిపల్లి లో పొలం పేరు మార్పు కై అ గ్రామాల నుండి రెండు అర్జీలు అధికారులకు అందాయి. ఈ ప్రజావాణిలో ఎంపీవో శ్రీశైలం,హౌసింగ్, ఆర్‌అండ్‌బి ఏఈలు అరుణ్ ప్రసాద్, రవికుమార్, అటవీ, పశువైద్య శాఖ అధికారులు శారద, సౌమ్య, అబ్కారీ, వ్యవసాయ శాఖ అధికారులు దేవరాజు, శ్రీనివాస రాజు,అంగన్ వాడీ సూపర్ వైజర్ నాగమణి, జీపీవో కిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.

పదో తరగతిలో మంచి మార్కులు సాధించాలి: ఎమ్మెల్సీ రియాజుల్ హసన్



ఆత్మకూర్, నవంబర్ 2 (జనంసాక్షి): పదో తరగతి విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదివి వార్షిక పరీక్షల్లో మంచి మార్కులు సాధించాలని ఎంఐఎం ఎమ్మెల్సీ మీర్జా రియాజుల్ హసన్ అఫంది సూచించారు. సోమవారం సలారే మిల్లత్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆత్మకూరులో ఉర్దూ మీడియం పదో తరగతి విద్యార్థులకు ఉచితంగా మోడల్ పేపర్లు, ఆల్ ఇన్ వన్ గైడ్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ ఆర్థిక పరిస్థితులతో సంబంధం లేకుండా విద్యార్థులకు నాణ్యమైన విద్యా సహకారం అందించడమే లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ శ్రీనివాసులు, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ట్రస్ట్, పార్టీ ప్రతినిధులు పాల్గొన్నారు.

బాలికపై వేధింపులు.. సోదరుడిపై రాయితో దాడి

- **నిందితుడికి మూడేళ్ల జైలు.. రూ.20 వేల జరిమానా**
- **మెదక్ జిల్లా ఎస్పీ డి.వి.శ్రీనివాస రావు**

మెదక్ బ్యూరో, నవంబర్ 2 (జనంసాక్షి): బాలికపై లైంగిక వేధింపులకు పాల్పడటమే కాకుండా, ఆమె సోదరుడిపై రాయితో దాడి చేసిన కేసులో గొల్ల మధు (25) అనే వ్యక్తికి మూడేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ. 20 వేల జరిమానా విధిస్తూ మెదక్ ఫాస్ట్ ట్రాక్ పోక్సో కోర్టుతీర్పు వెల్లడించింది. ఈ వివరాలను మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు వెల్లడించారు. నవంబర్ 2024లో 16 సంవత్సరాల బాలిక ఐకేపీ సెంటర్ వైపు నడుచుకుంటూ వెళ్తుండగా మధు ఆమె చేయి పట్టుకుని లాగి, తనను ప్రేమించాలని చెబుతూ అసభ్యంగా ప్రవర్తించాడు. దీంతో బాలిక గట్టిగా కేకలు వేయడంతో ఆమెను వదిలిపెట్టాడు. ఈ విషయాన్ని బాలిక కుటుంబ సభ్యులకు తెలియజేయగా, ఆమె సోదరుడు మధును ప్రశ్నించాడు. దీంతో ఆగ్రహించిన మధు రాయితో అతడి తలపై దాడి చేయడంతో గాయాలయ్యాయి. ఈ ఘటనపై బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు శంకరంపేట ఆర్ ఎస్ఐ ఎ.నారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పూర్తి సాక్ష్యాధారాలను సేకరించి న్యాయ స్థానంలో సమర్పించారు. విచారణ సందర్భంగా స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎం.బాలయ్య బలమైన వాదనలు వినిపించారు. సాక్ష్యాధారాలను పరిశీలించిన ఫాస్ట్ ట్రాక్ పోక్సో కోర్టు న్యాయమూర్తి ఆర్.ఎం. సుభవల్లి నిందితుడికి మూడేళ్ల కఠిన కారగారా శిక్షతో పాటు రూ. 20 వేల జరిమానా విధించినట్లు జిల్లా ఎస్పీ తెలిపారు. ఈ కేసులో నిందితుడికి శిక్ష పడేలా



కృషి చేసిన ఎసై నారాయణ, పీపీ బాలయ్య, కోర్టు లైజనింగ్ అధికారి ఎస్ఐ బి. విఠల్, కానిస్టేబుల్ జి. కృష్ణ గౌడ్, కోర్టు డ్యూటీ ఆఫీసర్ శ్రీధర్‌లను జిల్లా ఎస్పీ అభినందించారు. మహిళలు, బాలికలపై వేధింపులకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, బాధితులు భయపడకుండా పోలీసులను ఆశ్రయించాలని ఎస్పీ సూచించారు.

అల్లాదుర్గం మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలి



అల్లాదుర్గం, నవంబర్ 2 (జనంసాక్షి): అల్లాదుర్గం మండలాన్ని కరువు మండలంగా ప్రకటించి రైతులను ఆదుకోవాలని బీఆర్ఎస్ మండల పార్టీ ఆధ్వర్యంలో సోమవారం ప్రజావాణిలో ఎంపీడీవో వేద ప్రకాష్ రెడ్డి, తహసీల్దార్ మల్లయ్యకు వినతిపత్రం అందజేశారు. వర్షాభావంతో చెరువులు, కుంటలు ఎండిపోయి భూగర్భ జలాలు అడుగంటడంతో బోర్లు వట్టిపోయాయని తెలిపారు. వరి, మొక్కజొన్న, పత్తి తదితర పంటలు ఎండిపోయి రైతులు తీవ్రంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం పంట నష్టాన్ని అంచనా వేసి ఎకరాకు రూ.50 వేల పరిహారం అందించాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పల్లెగడ్డ నరసింహులు, నాయకులు పాల్గొన్నారు.

ఇంట్లో ఉరివేసుకుని వ్యక్తి మృతి

చిన్న శంకరంపేట, నవంబర్ 2 (జనంసాక్షి): మండలంలోని శాలిపేట గ్రామంలో ఉప్పరి సిద్ధిరాములు (36) సోమవారం ఇంట్లో ఉరివేసుకుని మృతి చెందాడు. పోలీసుల వివరాల ప్రకారం.. కుటుంబ కలహాల కారణంగా భార్య కొంత కాలంగా పుట్టింట్లో ఉంటోంది. సోమవారం మధ్యాహ్నం సిద్ధి రాములు ఇంట్లో దూలానికి చీరతో ఉరివేసుకున్నట్లు కుటుంబ సభ్యులకు సమాచారం అందింది. ఘటనాస్థలానికి చేరుకున్న కుటుంబ సభ్యులు మృతదేహాన్ని గుర్తించారు. మృతుడి భార్య ఎవరిపైనా అనుమానం లేదని పోలీసులకు తెలిపింది. ఎస్సై శివానందం కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఖేత్ బచావో రైతులకు అవగాహన కార్యక్రమం

గద్వాల నడిగడ్డ, సెప్టెంబర్ 2(జనంసాక్షి); జోగులాంబ గద్వాల జిల్లా గట్టు మండలంలోని ఆరగిద్ద గ్రామంలో సోమవారం తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం జోగులాంబ గద్వాల కోఆర్డినేటర్ డా.పి.ఆర్చన "ఖేత్ బచావో" కార్యక్రమంలో భాగంగా రైతులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఈ సందర్భంగా ప్రస్తుత వాతావరణ పరిస్థితులు, రాబోయే రోజుల్లో ఎల్‌నినో ప్రభావం కారణంగా ఏర్పడే వాతావరణ మార్పులను దృష్టిలో ఉంచుకొని రైతులు పంటల ఎంపికలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అధిక నీటి అవసరం కలిగిన వరి, మొక్కజొన్న పంటలకు బదులుగా ప్రస్తుత వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా జొన్న, ఉలవలు, అలసందలు, వేరుశనగ వంటి ప్రత్యామ్నాయ పంటలను సాగుచేయాలని సూచించారు.

రాబోయే జూలై 2027 వరకు ఎల్‌నినో ప్రభావం ఉండే అవకాశం ఉన్నందున నీరు,



విద్యుత్ వినియోగాన్ని తగ్గించుకోవాలని, అవసరమైన మేరకే సాగునీటిని వినియోగించాలని, నీటి సంరక్షణ చర్యలు చేపట్టాలని రైతులకు వివరించారు. వాతావరణ మార్పులను తట్టుకునే పంటల విధానాలను అనుసరించడం ద్వారా వ్యవసాయంలో నష్టాలను తగ్గించుకోవచ్చని తెలిపారు.

ఈ కార్యక్రమంలో గట్టు మండల వ్యవసాయ అధికారి హనుమంతు, ఆరగిద్ద వ్యవసాయ విస్తరణ అధికారి (ఆత్మ) ప్రతినిధి, ఆరగిద్ద గ్రామ సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి రైతులు తదితరులు పాల్గొన్నారు.

మహా పాదయాత్రకు బయలుదేరిన బీజేపీ శ్రేణులు

మక్తల్, నవంబర్ 2 (జనంసాక్షి): మక్తల్ నియోజకవర్గ పరిధిలోని మక్తల్, మాగనూరు, కృష్ణ మండలాల నుండి పలువురు బీజేపీ నాయకులు, కార్యకర్తలు అమిత్ షా చేపట్టిన మహా పాదయాత్రలో పాల్గొనేందుకు హైదరాబాద్‌కు బయలుదేరి వెళ్లారు. ఈ కార్యక్రమంలో నారాయణపేట జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షులు వెంకట్రములు, కృష్ణ మండల బీజేపీ అధ్యక్షులు నల్లేర, నర్సప్ప, మాగనూరు మండల కిసాన్ మోర్చా అధ్యక్షులు నరసింహ రెడ్డి, మక్తల్ మండల బీజేపీ ప్రధాన కార్యదర్శి సురేష్ కుమార్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



ప్రజావాణికి 5 దరఖాస్తులు: ఎంపీడీవో వెంకట లక్ష్మమ్మ



శివ్వంపేట నవంబర్ 2 (జనంసాక్షి): మండల కేంద్రమైన శివ్వంపేట ఎంపిడివో కార్యాలయంలో సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు జరిగిన ప్రజావాణి కార్యక్రమానికి 5 దరఖాస్తులు రావడం జరిగిందని మండల పరిషత్ అభివృద్ధి అధికారి వెంకటలక్ష్మమ్మ తెలిపారు. ఈ దరఖాస్తులలో శివ్వంపేట గ్రామంలో 8,9 వార్డులో ఉన్న మినీ వాటర్ ట్యాంక్‌లను శుభ్రం చేయడంలేదని వీ.నగేష్ దరఖాస్తు ఇచ్చారు. కొత్తపేట గ్రామంలో ఇటీవల షర్ట్ సర్క్యూట్‌తో దగ్ధమైన ఇంటికి ప్రభుత్వం నుంచి నష్టపరిహారం ఇప్పించాలని, అలాగే తమకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని బాధితుడు ప్రవీణ్ దరఖాస్తులు అందజేశారు. ఉసిరికపల్లి నుంచి ఇతర రాష్ట్రాల చెందిన కార్మికుల పిల్లలు చదువుకోవడానికి పాఠశాలకు వెళ్లడం లేదని, తమ గ్రామంలో ఈజీఎస్ పనులు చేపట్టాలని బాలేష్ రెండు దరఖాస్తులు అందజేశారు.

ప్రమాద బాధితుడికి అండగా తోర్నల్ సర్పంచ్



నాగల్గిద్ద, నవంబర్ 2 (జనంసాక్షి): మానూర్ మండలంలోని డావుర్ చౌరస్తా వద్ద ద్విచక్ర వాహనంపై వెళ్తున్న వ్యక్తి రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. అదే మార్గంలో వెళ్తున్న తోర్నల్ గ్రామ సర్పంచ్ సంగమేశ్వర్ పాటిల్ ప్రమాదాన్ని గమనించి వెంటనే స్పందించారు. తన వాహనాన్ని నిలిపి గాయపడిన వ్యక్తి వద్దకు చేరుకుని దగ్గరుండి అవసరమైన సహాయం అందించారు. ఆపదలో ఉన్న వ్యక్తికి మానవత్వంతో అండగా నిలిచిన సర్పంచ్‌ను పలువురు అభినందించారు. ప్రజా ప్రతినిధిగా తన బాధ్యతతో పాటు సేవాభావాన్ని చాటుకున్నారని ప్రశంసించారు.

చెట్టుకు ఉరివేసుకుని యువకుడి ఆత్మహత్య



తెలకపల్లి, నవంబర్ 2(జనంసాక్షి): కుటుంబ కలహాలతో మనస్తాపం చెందిన పర్వతాపూర్ గ్రామానికి చెందిన జరుపటి శేఖర్ (28) చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై ఎం.రమేష్ తెలిపిన వివరాల ప్రకారం.. భార్యా భర్తల మధ్య కొంతకాలంగా గొడవలు జరుగుతున్నాయి. సోమవారం ఇంటి నుంచి బయటకు వెళ్లిన శేఖర్, తన అన్నకు ఫోన్ చేసి ఆత్మహత్య చేసుకుంటున్నట్లు తెలిపాడు. కుటుంబ సభ్యులు వెతకగా తెలకపల్లి శివారులోని ఓ వెంచర్‌లో వేపచెట్టుకు వేలాడుతూ మృతదేహం కనిపించింది. భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


ఎండిన పంటలకు నష్టపరిహారం చెల్లించాలి...

- **ప్రజావాణిలో సీపీఎం నాయకుల వినతి.. జూలపల్లిలో 75 ఎకరాల్లో పంటనష్టం**

మహమ్మదాబాద్, నవంబర్ 02 (జనంసాక్షి): భూగర్భ జలాలు అడుగంటడంతో బోర్లు ఎండిపోయి పంటలు చేతికందకుండా పోయాయని,తీవ్రంగా నష్టపోయిన రైతులను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు.మహమ్మదాబాద్ మండలం జూలపల్లి గ్రామంలో బోర్ల కింద సాగు చేసిన సుమారు.60ఎకరాల వరి,15ఎకరాల కంది పంటలు పూర్తిగా ఎండిపోయి రైతులు తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోయారని ఆవేదన వ్యక్తం చేశారు.

సోమవారం మండల కేంద్రంలో నిర్వహించిన ప్రజావాణిలొ సీపీఎం మహమ్మదాబాద్ మండల కమిటీ ఆధ్వర్యంలో బాధిత రైతులతో కలిసి.ఎంపీడీవో నరేందర్ రెడ్డికి,వినతిపత్రం అందజేశారు.ఈసందర్భంగా వారు మాట్లాడుతూ,జూలపల్లి గ్రామ రైతులు అప్పులు చేసి,పెట్టుబడులు పెట్టి బోర్ల కింద వరి,కంది,పంటలను సాగు చేశారని తెలిపారు.

భూగర్భజలాలు పడిపోవడంతో బోర్లు ఎండిపోయి సుమారు.75ఎకరాల్లో పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయని పేర్కొన్నారు.ఎకరాకు రూ.30 వేల నుంచి రూ.60వేల



వరకు పెట్టుబడి పెట్టిన రైతులు పంటలు ఎండిపోవడంతో తీవ్రంగా,నష్టపోయారని ఆవేదన వ్యక్తంచేశారు.సాగు కోసం చేసిన అప్పులు ఎలా తీర్చాలో తెలియక రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారని పేర్కొన్నారు.అధికారులు క్షేత్రస్థాయిలో పంట నష్టాన్ని పరిశీలించి,బాధిత రైతులకు ఎకరాకు తగిన నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు.రైతులకు రైతు బీమా,ఇన్‌పుట్ సబ్సిడీ వంటి ప్రభుత్వ సహాయాన్ని అందించి ఆదుకోవాలని కోరారు.

యువకుడి ఆత్మహత్య

- **తల్లి వెంకటమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన ఎస్సై రజిత**

రేవల్లి, నవంబర్ 02 (జనంసాక్షి):
రేవల్లి మండలం గౌరీదేవిపల్లి గ్రామానికి చెందిన గువ్వల పవన్ తండ్రి శేఖర్ (18) ఆదివారం సాయంత్రం ఇంట్లో ఆత్మహత్య చేసుకొని మృతి చెందాడు.

కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం, ఆదివారం తేదీ 01.11.2026న సాయంత్రం 04:30 గంటలకు ఇంట్లోనే ఈ ఘటన జరిగింది. మృతుని తల్లి వెంకటమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, రేవల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం (గ్రావీజు) నిర్వహించి, మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు డ్రైవర్ మండలం ఎస్సై రజిత తెలిపారు.

మృతునికి ఒక అక్క, ఒక అన్న ఉన్నారు. గ్రామంలో ఈ ఘటన విషాదాన్ని నింపింది.

కాచెరువు శిఖం భూమిని కాపాడాలి



మద్దూరు, నవంబర్ 2 (జనంసాక్షి):
మద్దూరు గ్రామ శివారులోని కాచెరువు శిఖం భూమిని సర్వే చేసి హద్దులు నిర్ణయించి ఆక్రమణలను అరికట్టాలని మత్స్య సహకార సంఘం సభ్యులు కోరారు. సోమవారం ప్రజావాణిలో ఎంపీడీవో భార్గవ్ రామ్‌కు వినతిపత్రం అందజేశారు. నిడ్జింత రోడ్డు సమీపంలోని కాచెరువు పరిధిలో 60 ఎకరాల 10 గుంటల శిఖం భూమి ఉందని, కొందరు వ్యక్తులు ఆక్రమించి ప్లాట్లుగా విభజిస్తున్నారని తెలిపారు. చెరువు ఉనికికి ప్రమాదం ఏర్పడ కుండా రెవెన్యూ, సర్వే అధికారులు తక్షణమే స్పందించి సమగ్ర సర్వే నిర్వహించి హద్దురాళ్లు ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘం కార్యదర్శి నిడ్జింత విష్ణు, సభ్యులు పాల్గొన్నారు.

మాజీ ఉప సర్పంచ్ వెంకటయ్య కన్నుమూత



రేవల్లి, నవంబర్ 02 (జనంసాక్షి):
తల్పునూర్ గ్రామ మాజీ ఉప సర్పంచ్, పాఠశాల విద్యా కమిటీ మాజీ చైర్మన్ వెంకటయ్య (55) అనారోగ్యంతో ఆదివారం మృతి చెందారు. ఉప సర్పంచ్, సర్పంచ్‌గా, విద్యా కమిటీ చైర్మన్‌గా పనిచేసి గ్రామ అభివృద్ధికి సేవలందించారు. ప్రజలతో కలివిడిగా ఉంటూ మంచి పేరు సంపాదించుకున్నారు. ఆయన మృతితో గ్రామంలో విషాదం నెలకొంది. గ్రామస్తులు, ప్రజాప్రతినిధులు, యువకులు సంతాపం వ్యక్తం చేస్తూ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

జిల్లాస్థాయి పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



గద్వాల, నవంబర్ 2 (జనంసాక్షి): బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యాశాఖ ఆధ్వర్యంలో గద్వాల బాలభవన్‌లో నిర్వహించిన జిల్లాస్థాయి పోటీల్లో విద్యార్థులు ప్రతిభ చాటారు. జానపద నృత్యంలో శాంతినగర్ ప్రవంతి, పూడూరు భవ్య, అమరవాయి రాజేశ్వరి జట్లు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించాయి. నాటకీకరణలో అమరవాయి ఇందు, పూడూరు అనూష, మల్దకల్ దుర్యోధన జట్లు విజేతలుగా నిలిచాయి. శాస్త్రీయ నృత్యం, దేశభక్తి గీతాలు, చిత్రలేఖనం, వక్తృత్వ పోటీల్లోనూ విద్యార్థులు పాల్గొన్నారు. డీఈవో విజయలక్ష్మి విజేతలకు బహుమతులు, పాల్గొన్న వారికి ప్రశంసాపత్రాలు అందజేశారు. విజేతలు రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా తరఫున పాల్గొననున్నారు.

4వ రోజుకు చేరిన భూనీడు నిరసన దీక్ష



కొత్తపల్లి, నవంబర్ 2 (జనంసాక్షి): 2023 అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ నాయకులు భూనీడు గ్రామ ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన నిరసన దీక్ష నాలుగో రోజుకు చేరుకుంది. గ్రామంలో పోలీస్ స్టేషన్, ప్రభుత్వ ఆసుపత్రి ఏర్పాటు చేయాలని నిరసనకారులు కోరారు. అన్ని అర్హతలు ఉన్నప్పటికీ మండల హోదా విషయంలో గ్రామానికి అన్యాయం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇచ్చిన హామీలను ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలని, లేకుంటే ఆందోళనను ఉధృతం చేసి యువకులంతా ఆమరణ నిరాహార దీక్షకు దిగుతామని హెచ్చరించారు.

ప్రభుత్వ పాఠశాలలో డిజిటల్ విద్యకు నూతన శ్రీకారం

చౌట్కూర్, నవంబర్ 2 (జనంసాక్షి):
గ్రామీణ ప్రాంత విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి డిజిటల్ విద్యను అందించడంతో పాటు ప్రభుత్వ పాఠశాలలను ఆధునిక సౌకర్యాలతో అభివృద్ధి చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని ప్రముఖ సినీ నటి, సామాజిక కార్యకర్త మంచు లక్ష్మి తెలిపారు. సోమవారం చౌట్కూర్ మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో టీచ్ ఫర్ చేంజ్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన డిజిటల్ స్మార్ట్ క్లాస్‌రూమ్‌ను ఆమె ప్రారంభించారు.
ఈ సందర్భంగా మంచు లక్ష్మి మాట్లాడుతూ తెలంగాణలోని 33 జిల్లాల్లో ప్రభుత్వ పాఠశాలలను స్మార్ట్ క్లాస్‌రూమ్‌లుగా తీర్చిదిద్దే కార్యక్రమంలో భాగస్వామి కావడం సంతోషంగా ఉందన్నారు. ఈ ఏడాది తమ ట్రస్ట్ ద్వారా 364కు పైగా పాఠశాలలను ఆధునీకరిస్తున్నట్లు వెల్లడించారు. విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలను గుర్తించి సమకూర్చేందుకు ప్రత్యేకంగా కృషి చేస్తున్నామని తెలిపారు.
మారుమూల గ్రామాలు, గిరిజన ప్రాంతాలు, అంగన్

• స్మార్ట్ క్లాస్‌రూమ్‌ను ప్రారంభించిన సినీ నటి మంచు లక్ష్మి





వాడీ కేంద్రాల్లోనూ విద్యాభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నామని పేర్కొన్నారు. చిన్నపాటి సహాయం కూడా విద్యార్థుల జీవితాల్లో గొప్ప మార్పు తీసుకురాగలదని అన్నారు. విద్యార్థులకు సైన్స్, గణితంతో పాటు కమ్యూనికేషన్ నైపుణ్యాలు, ఆంగ్ల ఉచ్చారణపై కూడా ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. వీటి ద్వారా పిల్లల్లో ఆత్మవిశ్వాసం పెరిగి భవిష్యత్తులో ఐఏఎస్, ఐపీఎస్ అధికారులుగా ఎదిగే అవకాశం ఉంటుందని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి దాతలు, స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. అందరి సహకారం, సమన్వయంతో ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యను అందించవచ్చన్నారు. కార్యక్రమా నికి సహకరించిన దాతలు, వాలంటీర్లకు కృతజ్ఞతలు తెలిపారు.
ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గాజుల సుభాష్ బాబు, మాజీ ఎంపీపీ సుభాష్ రెడ్డి, సర్పంచ్ పార్కల రాంరెడ్డి, ఎంఈఓ అనురాధ, ఆత్మ కమిటీ చైర్మన్ మల్లారెడ్డి, జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షుడు నందికంటి రామచంద్రారెడ్డి, ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే చింతా ప్రభాకర్..





సదాశివపేట, నవంబర్ 2 (జనంసాక్షి):
సదాశివపేట మండలం పెద్దాపూర్ రైతు వేదికలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ ప్రారంభించారు.
ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రైతులు పండించిన ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేయాలన్నారు. పంట సేకరణలో పారదర్శకత ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి రైతుకు సమయానికి చెల్లింపులు జరిగేలా వ్యవస్థను పటిష్టం చేయాలన్నారు. కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఏవో రమేష్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గడీల సుమిత్రా సుధీర్ రెడ్డి, బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు పెద్ద గొల్ల ఆంజనేయులు, ప్రాథమిక వ్యవసాయ సంఘం డైరెక్టర్లు, సర్పంచులు, ఉప సర్పంచ్లు, మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రమాద బాధితుడైన డాన్స్ మాస్టర్‌కు జర్నలిస్టుల ఆర్థికసాయం



కల్వకుర్తి, నవంబర్ 2 (జనంసాక్షి): రోడ్డు ప్రమాదంలో గాయపడి కాలుకు శస్త్ర చికిత్స చేయించుకున్న కల్వకుర్తి ఇందిరా నగర్‌కు చెందిన జర్నలిస్టు, డాన్స్ మాస్టర్ ఏదుల శేఖర్‌ను టీయూడబ్ల్యూజే (ఐజేయూ) జాతీయ కౌన్సిల్ సభ్యుడు గోలి సుదర్శన్ రెడ్డితో పాటు జర్నలిస్టులు పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని వైద్య ఖర్చుల నిమిత్తం రూ.5 వేల ఆర్థిక సాయం అందజేశారు. శేఖర్ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ, కష్టకాలంలో జర్నలిస్టులకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో కృష్ణయ్య, దుబ్బ నాగేష్, కస్తూరి శ్రీనివాస్, రాంచందర్, జహీర్, రాజన్న, నరేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణి ఫిర్యాదులకు ప్రాధాన్యతనిస్తూ సత్వర పరిష్కారం చూపాలి

• ఎస్‌డిసి రాజేందర్ గౌడ్

నారాయణపేట నవంబర్ 2(జనంసాక్షి): ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి స్వీకరించే ఫిర్యాదులకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ, వాటిని సంబంధిత శాఖల అధికా రులు క్షుణ్ణంగా పరిశీలించి సత్వరమే పరిష్కరించాలని ఎస్.డి.సి.రాజేందర్ గౌడ్, ఆర్డీవో రమేష్ సూచించా రు.సోమవారం జిల్లా కలెక్ట రేట్‌లోని ప్రజావాణి హాల్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా నలు మూలల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వివిధ అంశాలపై అర్జీలను సమర్పించారు.ఈ సందర్భంగా ప్రజల నుంచి అర్జీలను స్వీకరించిన ఎస్ ఎస్.డి.సి.రాజేందర్ గౌడ్, ఆర్డీవో రమేష్ అర్జీదారుల సమస్యలను సావధానంగా విని, వాటి పరిష్కారానికి సంబంధిత శాఖల అధికారులు తక్షణమే స్పందించి అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశిం చారు. ప్రజావాణిలో అందిన ప్రతి ఫిర్యాదును బాధ్య తాయుతంగా పరిశీలించి, నిర్ణీత సమయంలో పరిష్క రించేలా అధికారులు కృషి చేయాలని సూచించారు. కాగా, సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 49 అర్జీలు అందినట్లు కలెక్టరేట్ ప్రజావాణి విభాగం అధికారులు వెల్లడించారు.ఈ కార్యక్రమంలో వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన జిల్లా అధికారులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికీ ఎమ్మెల్యే పరామర్శ



శివ్వంపేట, నవంబర్ 2 (జనంసాక్షి):
శివ్వంపేట మండలం గుండ్లపల్లి బిఆర్ఎస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు ఉప్పునూతల వెంకటేష్ గౌడ్ తల్లి వరమ్మ నాలుగు రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందడంతో పార్టీ శ్రేణుల ద్వారా ఈ విషయం తెలుసుకున్న నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి సోమవారం గుండ్లపల్లి గ్రామానికి చేరుకొని పార్టీ నాయకులతో కలిసి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. వరమ్మ మృతి పట్ల తన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ సమయంలో ఆమె వెంట మాజీ గ్రంథాలయ చైర్మన్ చంద్ర గౌడ్, మాజీ ఎంపీపీ కల్లూరి హరికృష్ణ, బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు రమణ గౌడ్, మాజీ సర్పంచ్ పెంజర్ల శ్రీనివాస్, నాయకులు సత్యనారాయణ, మహేందర్. సదానందం తదితరులు పాల్గొన్నారు.

నీటిని, విద్యుత్తుని పొదుపుగా వాడాలి



మల్దకల్, నవంబర్ 2 (జనంసాక్షి): ఎల్‌నినో ప్రభావం తీసుకోవలసిన జాగ్రత్తలు ప్రజలకు అవగాహన కల్పించిన టిఎస్ఎస్ ఉద్యోగులు జోగులాంబ గద్వాల జిల్లా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు సోమవారం జిల్లా పౌర సంబంధాల శాఖ అధికారి ఆధ్వర్యంలో మల్దకల్ మండలం చిన్న తాండ గ్రామంలో ఉపాధి ఆహార పని కార్యక్రమంలో ఎల్‌నినో ప్రభావ పై గ్రామ ప్రజలకు అవగాహన భూగర్భ జలాలు కాపాడడంనీటిని పొదుపుగా వాడుకోవడం ప్రతి ఒక్కరూ ఇంకుడు గుంత నిర్మాణం చేపట్టడంవిద్యుత్తు చూసి వినియోగించుకోవడం జీవులకు మూగ జంతువులకు గ్రామ పరిసర ప్రాంతంలో రైతుల పొలాల దగ్గర నీళ్లతొట్టిలను ఏర్పాటు చేయాలని అవగాహన కల్పించారు.. మండలం మద్దెలబండ చిన్నతండాలో గ్రామ సర్పంచ్ నారు నాయక్, ఉప సర్పంచ్ గ్రామ మహిళలు,రైతులు, పెద్దలుకూలీలు పాల్గొన్నారు.మండల రెవెన్యూ అధికారి,మండల డెవలప్మెంట్ పరిషత్ అధికారి,విద్యుత్ పశు వైద్యాధికారుల పర్యవేక్షణలో సమన్వయంతో తెలంగాణ సాంస్కృతిక సారథి ఉద్యోగ కళాకారులు ప్రజలకు అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో టిఎస్ఎస్ కళాబృందం హజరత్, రాహుల్,కేశవులు ప్రజలను చైతన్యపరిచారు.

భూ రికార్డుల కోసం ప్రైవేటు వ్యక్తులను ఆశ్రయించాలా?

• తహసీల్దార్ కార్యాలయ రికార్డు అసిస్టెంట్‌పై ప్రజావాణిలో ఫిర్యాదు



తెలకపల్లి, (జనంసాక్షి): మండల తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం భూ రికార్డుల ప్రతుల జారీ వ్యవహారం వివాదాస్పదంగా మారింది. రైతులు తమ భూములకు సంబంధించిన పహాణీలు, ఆర్ఓఆర్ ప్రతుల కోసం కార్యాలయానికి వస్తే, రికార్డు అసిస్టెంట్ కార్యాలయం వెలుపల ఉన్న ప్రైవేటు వ్యక్తులకు ఫోన్ చేసి వివరాలు తెలియజేస్తున్నారని, వారి వద్ద జిరాక్స్ ప్రతులు తీసుకోవాలని సూచిస్తున్నారని ఫిర్యాదుదారులు ఆరోపించారు. ప్రభుత్వ కార్యాలయంలోనే అందుబాటులో ఉండాల్సిన భూ రికార్డుల కోసం ప్రైవేటు వ్యక్తుల వద్దకు వెళ్లాల్సిన పరిస్థితి ఎందుకు వస్తోందని వారు ప్రశ్నించారు. ఈ వ్యవహారంపై ప్రజావాణిలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో అధికారులకు ఫిర్యాదు చేశారు. అనంతరం ఉప తహసీల్దార్ లక్ష్మణ్ నాయక్‌కు కూడా ఫిర్యాదు పత్రం అందజేశారు. ఈ ఆరోపణలపై ఉన్నతాధికారులు సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను నిగ్గుతేల్చాలని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రభుత్వ కార్యాలయం నుంచే భూ రికార్డుల ప్రతులు అందించేలా చర్యలు తీసుకోవాలని ఫిర్యాదుదారులు కోరారు.



నారాయణపేటలో అభివృద్ధి శూన్యం..

ప్రతి వార్డుకు రూ.10 లక్షలు కేటాయించాలి

• కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు వెంకటేష్ గౌడ్ డిమాండ్



నారాయణపేట నవంబర్ 2(జనంసాక్షి): నారాయణపేట పట్టణంలో బిజెపి మున్సిపల్ చైర్మన్ కొండా శ్వేత సత్య యాదవ్ బాధ్యతలు చేపట్టి 9 నెలలు గడుస్తున్నా ఇప్పటి వరకు ఎలాంటి అభివృద్ధి లేదని నారాయణపేట పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు వెంకటేష్ గౌడ్ ఒక ప్రకటనలోవిమర్శించారు.మున్సిపల్ పాలకవర్గం ఏర్పడిన తరువాత ఇప్పటి వరకు 4 కౌన్సిల్ సమావేశా లు జరిగినప్పటికీ పట్టణం లోని ఏ ఒక్క వార్డులోనూ అభివృద్ధి పనులకు నిధులు కేటాయించక పోవడం విచారకరమని విమర్శించారు.ప్రతి కౌన్సిల్ సమావేశంలోనూ బిల్లుల ఆమోదా నికే ప్రాధాన్యత ఇస్తున్నారే తప్ప, వార్డుల అభివృద్ధిని, ప్రజల సమస్యలను పట్టించుకోవడం లేదని అన్నారు. వార్డుల అభివృద్ధి కోసం నిధులు అడిగితే మున్సిపాలిటీలో డబ్బులు లేవని చెప్పడం ఎంతవరకు సమంజసమనిప్రశ్నించారు.
పట్టణం లో అనేక వార్డుల్లో చిన్న చిన్న సమస్యలు చాలా ఉన్నాయి 9 నెలలు గడుస్తున్నా పరిష్కరించ డంలో విఫలం అయ్యారు. పట్టణంలోని వార్డుల అభివృద్ధిపై శ్రద్ధ చూపించా లని, ప్రజాధనాన్ని ప్రజల అవసరాల కోసం వినియో గించాలని సూచించారు.
కనీసం ఈ కౌన్సిల్ సమా వేశంలోనైనా వార్డుల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించి, నారాయణపేట పట్టణంలోని ప్రతి వార్డుకు రూ.10 లక్షల చొప్పున అభివృద్ధి నిధులు కేటా యించాలని మున్సిపల్ చైర్మన్‌ను డిమాండ్ చేశారు.

నేడు పేటలో విద్యుత్ వినియోగదారుల దినోత్సవం

నారాయణపేట నవంబర్2 (జనంసాక్షి): తెలంగాణ రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి ఆదేశాల మేరకు ఈ నెల 3న నిర్వహించే విద్యుత్ వినియోగదారుల దినో త్సవాన్ని పురస్కరించుకొని, నారాయణపేట సర్కిల్ పరిధిలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు సూపరింటెండింగ్ ఇంజనీర్ బి.నవీన్ కుమార్ తెలిపారు.ఈ సందర్భంగా 3న ఉదయం 11:00 గంటల నుండి నారాయణ పేట సర్కిల్ కార్యాలయం, కోస్గి సబ్ డివిజన్ కార్యాల యం మక్తల్ సబ్ డివిజన్ కార్యాలయాల్లో నిర్వహించ బడతాయి.ఈ సందర్భంగా విద్యుత్ వినియోగదారుల నుంచి విద్యుత్ సరఫరా అంతరాయాలు, మీటర్ సమస్యలు, విద్యుత్ బిల్లులు, కొత్త సర్వీసులు తదితర సమస్యలపై ఫిర్యాదులు స్వీకరించి, వాటిని సాధ్యమైనంత త్వరగా పరిష్కరించేందుకు సంబంధిత అధికారులు, సిబ్బంది అందుబాటులో ఉంటారనీ తెలిపారు.అదేవిధంగా వినియోగదా రుల హక్కులు, విద్యుత్ వినియోగదారుల ఫిర్యాదుల పరిష్కార వేదిక (సి.జి.ఆర్.ఎఫ్)విద్యుత్ అంబుడ్స్‌మన్ సేవలు, విద్యుత్ భద్రత మరియు విద్యుత్ పొదుపుపై అవగా హన కల్పించనున్నారు.కావున విద్యుత్ వినియోగ దారులు తమ సమస్యలు, ఫిర్యాదులతో సంబంధిత కార్యాలయాలకు హాజరై ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూపరింటెండింగ్ ఇంజనీర్ బి. నవీన్ కుమార్ కోరారు.

రెగ్యులర్ పంచాయతీ కార్యదర్శిని నియమించాలి



అల్లాదుర్గం, నవంబర్ 2 (జనంసాక్షి): గడి పెద్దాపూర్ మేజర్ గ్రామ పంచాయతీకి వెంటనే రెగ్యులర్ పంచాయతీ కార్యదర్శిని నియమించాలని బీఆర్ఎస్ నాయకులు ప్రజావాణిలో అధికారులకు వినతిపత్రం అందజేశారు. గత ఆరు నెలలుగా ఇన్‌చార్జి కార్యదర్శితోనే పాలన కొనసాగుతుండటంతో ప్రజలు ధృవీకరణ పత్రాలు, పారిశుధ్యం, అభివృద్ధి పనులు తదితర సేవల కోసం ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. గ్రామ పరిపాలన సజావుగా సాగేందుకు రెగ్యులర్ కార్యదర్శిని నియమించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కోఆప్షన్ సభ్యుడు మహ్మద్ సయ్యద్, కృష్ణ గౌడ్, పవన్, విజయ్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న రెండు టిప్పర్లు పట్టివేత



మాగనూర్, (జనంసాక్షి): మాగనూరు పోలీస్ స్టేషన్ పరిధిలో వేర్వేరు ప్రాంతాలలో అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు వేర్వేరు టిప్పర్ వాహనాలను పోలీసులు పట్టుకుని స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పోలీస్ సిబ్బంది తమ పరిధిలో బైక్ పెట్రోలింగ్ మరియు నిఘా విధుల్లో ఉండగా రెండు వేర్వేరు చోట్ల అక్రమ ఇసుక రవాణా ఉదంతాలు వెలుగుచూశాయి. ఒక కేసులో (వడ్వాట్ గేటు సమీపంలో వెళ్తున్న టిప్పర్ వాహనాన్ని ఆపి తనిఖీ చేయగా, ఎలాంటి ప్రభుత్వ అనుమతులు, రవాణా పత్రాలు లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తున్నట్లు గుర్తించారు.
అదేవిధంగా, మరో ప్రాంతంలో జరిగిన తనిఖీల్లో కూడా ఇలాగే ఎలాంటి పత్రాలు లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ఇంకొక టిప్పర్ వాహనాన్ని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.
ఈ రెండు వేర్వేరు సంఘటనలలో అక్రమంగా, దొంగతనంగా ఇసుక రవాణాకు పాల్పడుతున్న రెండు టిప్పర్ వాహనాలను, వాటి డ్రైవర్లను పోలీస్ స్టేషన్‌కు తరలించి, అందిన ఫిర్యాదుల మేరకు మాగనూరు పోలీసులు విడివిడిగా కేసులు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

పట్టభద్రులు ఓటు నమోదు చేసుకోవాలి.. రానున్నది బిఆర్ఎస్ ప్రభుత్వమే

• రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి



కల్వకుర్తి, నవంబర్ 2,(జనంసాక్షి): గ్రామాల్లో తండాల్లో ఏ ఒక్క పట్టభద్రుని ఓటు మిస్ కాకుండాఓటరుగా నమోదు కావాలని రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాసరెడ్డి సూచించారు.సోమవారం మండలంలోని తర్నికల్ తండాలో ఆయన పట్టభద్రుల ఓటరు నమోదు ప్రక్రియను పరిశీలించారు.రానున్న ఉమ్మడి పాలమూరు రంగారెడ్డి హైదరాబాద్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బిఆర్ఎస్ బలపరిచిన అభ్యర్థి గెలుపుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగులను నట్టేట ముంచిందని ఆవేదన వ్యక్తం చేశారు.అలవి గాని హామీలతో అధికారంలోకి వచ్చి రాష్ట్రంలో రైతులను ఉద్యోగులను కార్మిక కర్షకులను నిరుద్యోగులను గుసలు పెడుతున్న రేవంత్ సర్కారుకు త్వరలోనే చరమగీతం పాడే ఆవశ్యకత ఎంతైనా ఉందని శ్రీనివాస్ రెడ్డి అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో రానున్నది బిఆర్ఎస్ ప్రభుత్వమేనని ఈ సందర్భంగా పేర్కొన్నారు. తెలంగాణ తొలి ముఖ్య మంత్రి కేసీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ అభివృద్ధి పథకాలకు చరమ గీతం పాడి రాష్ట్రాన్ని అధోగతి పాలు చేసిన ఘనత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి దక్కిందని ఆయన అన్నారు. తండాలో మిగిలిపోయిన ప్రతి గ్రాడ్యుయేట్ ఓటరుగా నమోదు కావాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ ఎడమ సత్యం, మండల పార్టీ అధ్యక్షులు విజయ్ గౌడ్, నాయకులు గుండ్యా ,భీమ్లా, సోమ్లా, కౌన్సిలర్ రాము నాయక్, నాగులు నాయక్ నిరంజన్, ఐజాక్ అంజి మాస్టర్, తదితరులు పాల్గొన్నారు.

జడ్చర్ల ప్రభుత్వ ఆసుపత్రిలో సౌకర్యాలు కల్పించాలి

• బీజేపీ నాయకుడు ముచ్చర్ల జనార్దన్ రెడ్డి



జడ్చర్ల, నవంబర్ 2 (జనంసాక్షి): ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు ఎమ్మెల్యే తక్షణమే చర్యలు తీసుకోవాలని బీజేపీ నాయకుడు ముచ్చర్ల జనార్దన్ రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం ఆ పార్టీ నాయకులు ఆసుపత్రిని సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడ వసతులు, మౌలిక సదుపాయాల గూర్చి అడిగి తెలుసుకున్నారు. వచ్చే రోగులకు చెక్ చేసేందుకు సరిపడా బీపీ మిషన్లు లేవని, అవి తాను కొనిస్తానని ప్రకటించారు. అలాగే మంచి నీటి వసతి లేనందున తాను స్వయంగా ఆర్ఓ ప్లాంట్ ఏర్పాటు చేయిస్తున్నానన్నారు. ఆసుపత్రిపై ఎమ్మెల్యే, మాజీ మంత్రుల మధ్య వివాదాలు నిలిపి వేయాలన్నారు. ఎమ్మెల్యే స్థలం కేటాయింపు చేయించాలని, మాజీ మంత్రి కట్టించడం పూర్తి చేయాలన్నారు. లేదంటే ఇరువురిని ప్రజలు ఇంటికి పంపే సమయం వస్తుందన్నారు. క్రిటికల్ కేర్ బ్లాక్ త్వరగా ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలని, అత్యవసర పరిస్థితుల్లో వైద్యం అందించేందుకు తగిన డాక్టర్లను, సిబ్బందిని నియమించాలన్నారు. ప్రజా సమస్యలు గాలికి వదిలేసి ఒకరిపై ఒకరు ఆరోపణలు, ప్రత్యారోపణలు చేయటం సరికాదన్నారు. ఆసుపత్రికి వాస్తుదోషం అని ఒకరు, గుంతలో అని మరొకరు అనటం సరికాదన్నారు. పేదలను అయోమయానికి గురిచేసే వ్యాఖ్యలు చేయటం భావ్యం కాదన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర, జిల్లా, స్థానిక నాయకులు ముచ్చర్ల కృష్ణయ్య, యంబి బాలకృష్ణ, ఎడ్ల బాలవర్ధన్ గౌడ్, రామకృష్ణ, శ్రీనాథ్, బుక్కు నవీన్, వెంకటేష్, ఓర్సు నరేష్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు.

రేగోడు మండలాన్ని కరువు ప్రాంతంగా ఎందుకు ప్రకటించడం లేదు?

• అధికారులను నిలదీసిన దోసపల్లి సర్పంచ్ అమరసింహారెడ్డి



రేగోడు, నవంబర్ 2 (జనంసాక్షి): రేగోడు మండలాన్ని కరువు ప్రాంతంగా ప్రకటించాలని దోసపల్లి సర్పంచ్ అమరసింహారెడ్డి అధికారులను ప్రశ్నించారు. సోమవారం రేగోడు మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ప్రత్యేక మండల స్థాయి సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇతర మండలాల్లో కరువు పరిస్థితులు ఉన్నప్పుడు రేగోడులో ఎందుకు ప్రకటించడం లేదని నిలదీశారు. వర్షపాతం వివరాలను ఎలా నమోదు చేసి ఉన్నతాధికారులకు పంపించారని ప్రశ్నించారు.
గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పలువురు సర్పంచులు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ఇందిరమ్మ ఇళ్ల పథకంలో అర్హులకు ప్రాధాన్యత ఇవ్వాలని దోసపల్లి సర్పంచ్ అమరసింహారెడ్డి, పెద్దతాండ సర్పంచ్ సంగ్యానాయక్ కోరారు. అర్హులను గుర్తించి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని హౌసింగ్ ఏఈ హామీ ఇచ్చారు.
ఎల్లనినో ప్రభావంతో నీటి కొరత ఏర్పడుతున్నందున ప్రజలకు నీటి పొదుపుపై అవగాహన కల్పించాలని మిషన్ భగీరథ డీఈ నరేష్, గ్రిడ్ డీఈ బాలకృష్ణ సూచించారు. బోరుబావుల నుంచి ప్రత్యేక పైపుల ద్వారా ట్యాంకులను నింపి తాగునీటి సమస్య పరిష్కరించాలని తెలిపారు. కొండాపురం సర్పంచ్ పండరి సెల్‌ఫోన్ సిగ్నల్ సమస్యను ప్రస్తావించారు. సమావేశానికి పలువురు అధికారులు గైర్హాజరు కావడం, గత సమావేశాల తీర్మానాల వివరాలు అందించకపోవడంపై సర్పంచులు అసంతృప్తి వ్యక్తం చేశారు.
కార్యక్రమంలో తహసీల్దార్ దత్తారెడ్డి, ఎంపీడీవో శ్రీనివాస్, పలువురు సర్పంచులు, అధికారులు పాల్గొన్నారు.

శిథిలావస్థలో విద్యుత్ స్తంభం పట్టించుకోని అధికారులు

- ఎస్.ఈకి ఫిర్యాదు చేసిన పట్టించుకోని ఏడీఈ



గద్వాల నడిగడ్డ, నవంబర్ 2 (జనంసాక్షి): జోగులాంబ గద్వాల్ జిల్లా గద్వాల మండలం కాకులారం గ్రామంలో ఎల్లాగౌడ్ ఇంటిముందు విద్యుత్ స్తంభం శిథిలావస్థలో ఉన్నప్పటికీ అధికారులు పట్టించుకోవడంలేదని గ్రామస్తులు,వీధి ప్రజలు ఆరోపిస్తున్నారు. గత కొంతకాలం నుండి విద్యుత్ స్తంభం వల్ల కరెంట కరెంటు వేర్లు చెట్టుకు తాకడం వల్ల భయంకరమైన నిప్పురవ్వలు రాలుతూ ఉన్నాయి.విద్యుత్ స్తంభం మధ్యలో రావి చెట్టుతో పాటు తీగలు తగిలి ఉండడంతో విద్యుత్తు స్తంభం నుండి వైర్లు కరెంటు సరఫరా అయ్యి భయాందోళనకు గురవు తున్నారు. విద్యుత్ అధికారులకు ఫిర్యాదు చేసిన నేటి వరకు పట్టించుకోలేదని బాధితుడు వాపోయారు. గతంలో ప్రజాపాలనలో గ్రామంలో ఉన్న పాత ఇండ్లను విద్యుత్ స్తంభాలను తొలగించాలని ఉన్నప్పటికీ అప్పట్లో గ్రామస్తులు ప్రజాప్రతి నిధులు అధికారులు పట్టించుకోవడంలేదని వారు వాపోయారు. గద్వాల విద్యుత్ ఎస్ ఈ ఫిర్యాదు చేసినప్పటికీ గద్వాల్ ఏడిఈ చెప్పిన ఆయన ఇంతవరకు పట్టించుకోలేదని బాధితుడు ఆరోపించారు. ఇంటి ముందు ఉన్న రావిచెట్టును తొలగించి కొత్త విద్యుత్ స్తంభాలను ఏర్పా టు చేయాలని బాధితులు ఆ వీధి ప్రజలు కోరుతున్నారు.

బోర్‌వెల్ రీఛార్జ్‌తో భూగర్భ జలాల పెంపు!

- ప్రతి గ్రామంలో ఇంకుడు గుంతల ఏర్పాటుకు చర్యలు చేపట్టాలి
- వర్షపు నీటిని ఒడిసిపట్టి భూగర్భ జలాలను కాపాడుకుందాం: ఎంపీడీవో ఉమాదేవి



కోహిర్, నవంబర్ 2 (జనంసాక్షి): భూగర్భ జలాల మట్టం రోజురోజుకూ పడిపోతున్న నేపథ్యంలో వర్షపు నీటిని వృథా కాకుండా ఒడిసిపట్టి భూమిలోకి ఇంకేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని కోహిర్ మండల ఎంపీడీవో ఉమాదేవి పేర్కొన్నారు. భవిష్యత్తులో తాగునీటి, సాగునీటి కొరత తలెత్తకుండా ప్రతి గ్రామంలో ఇంకుడు గుంతలు, బోర్‌వెల్ రీఛార్జ్ నిర్మాణాలను ప్రోత్సహించాలని సూచించారు. వర్షాకాలంలో కురిసే వర్షపు నీటిలో అధిక శాతం వృథాగా కాలువలు, వాగుల ద్వారా బయటకు వెళ్లిపోతోందని, ఈ నీటిని భూమిలోకి ఇంకేలా చేసుకుంటే భూగర్భ జలాల మట్టం పెరిగే అవకాశం ఉంటుందని తెలిపారు. ముఖ్యంగా బోరుబావుల సమీపంలో రీఛార్జ్ పిట్స్ నిర్మించుకోవడం ద్వారా వర్షపు నీటిని భూగర్భంలోకి పంపించవచ్చని వివరించారు.
బోర్‌వెల్ రీఛార్జ్ పిట్‌లో ఇసుక, కంకర, వివిధ పరిమాణాల రాళ్ల పొరలను ఏర్పాటు చేసి వర్షపు నీటిని వడపోసి భూమిలోకి ఇంకేలా చేయవచ్చని తెలిపారు. ఈ విధానం ద్వారా భూగర్భ జలాల నిల్వలు పెరగడంతో పాటు బోరుబావుల్లో నీటి లభ్యత మెరుగుపడేందుకు దోహదపడుతుందని పేర్కొన్నారు. తక్కువ వర్షపాతం నమోదయ్యే ప్రాంతాల్లో ఈ విధానం ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని అన్నారు. మండలంలోని అన్ని గ్రామాల ప్రజాప్రతి నిధులు, గ్రామపంచాయతీ అధికారులు, ప్రజలు వర్షపు నీటి సంరక్షణపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. ప్రతి ఇంటి వద్ద, ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలల ఆవరణల్లోనూ ఇంకుడు గుంతల ఏర్పాటుకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.

మున్సిపాలిటీలో
విద్యుత్ పాడుపుపై అధికారులు దృష్టి సారించాలి

- పగటిపూట కూడా వెలుగుతున్న వీధిలైట్లు
- విద్యుత్ వృథాను అరికట్టాలని అధికారులకు విజ్ఞప్తి: బ్యాటరీ రాజు



మక్తల్, నవంబర్ 02 (జనంసాక్షి): రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావం వల్ల ఎదురవుతున్న విపత్కర పరిస్థితుల నేపథ్యంలో, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంచినీరు, విద్యుత్ పొదుపుపై ప్రత్యేక దృష్టి సారించాలని పిలుపునిచ్చారు. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి సూచనలను మక్తల్ మున్సిపాలిటీ పరిధిలో కూడా తూచా తప్పకుండా అమలు చేయాలని స్థానికులు కోరుతున్నారు.
?మక్తల్ మున్సిపాలిటీ పరిధిలోని మెజారిటీ ప్రాంతాల్లో వీధిలైట్లు పగలు, రాత్రి అనే తేడా లేకుండా నిరంతరం వెలుగుతూనే ఉన్నాయి.
దీనివల్ల భారీగా విద్యుత్ వృథా అవుతోంది. పగటిపూట అనవసరంగా వెలుగుతున్న వీధిలైట్లను ఆర్పివేసి, కేవలం రాత్రివేళల్లో మాత్రమే వెలిగేలా తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత విద్యుత్ శాఖ అధికారులను, మున్సిపల్ కమిషనర్‌ను, చైర్‌పర్సన్‌ను, కౌన్సిలర్లను పాలకమండలిని కోరుతున్నాము. గతంలో కూడా ఈ సమస్యను అప్పటి మున్సిపల్ కమిషనర్లకు, విద్యుత్ శాఖ అధికారులకు పలుమార్లు విన్నవించినప్పటికీ ఎటు వంటి స్పందనా లేదని, సమస్య పరిష్కారానికి నోచు కోలేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు బాధ్యతా యుతంగా స్పందించి, తక్షణమే సరైన చర్యలు తీసుకొని విద్యుత్ వృథాను అరికట్టాలని మక్తల్ ప్రజలు ఆశిస్తున్నారు.



రాష్ట్రస్థాయి మాక్ పార్లమెంట్‌లో మెదక్ జిల్లాకు ప్రథమ స్థానం

- ఉత్తమ పార్లమెంటేరియన్‌గా ఆర్తి చంద్రకు అవార్డు
- విద్యార్థులు భవిష్యత్తులో దేశానికి మంచి నాయకులుగా ఎదగాలి
- జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్



మెదక్ బ్యూరో, నవంబర్ 2 (జనంసాక్షి): రాష్ట్రస్థాయి మాక్ పార్లమెంట్ కార్యక్రమంలో మెదక్ జిల్లాకు ప్రథమ స్థానం లభించడం గర్వకారణమని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అన్నారు. రాష్ట్రస్థాయిలో ఉత్తమ పార్లమెంటేరియన్‌గా ప్రతిభ కనబరిచిన శంకరంపేట ఆర్ మండలం తెలంగాణ మోడల్ స్కూల్ విద్యార్థిని ఆర్తి చంద్రను సోమవారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో కలెక్టర్ ఘనంగా సన్మానించి అభినందించారు.
ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... హైదరాబాద్‌లోని ఎస్‌సీఈఆర్‌టీ గోదావరి ఆడిటోరియంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి మాక్ పార్లమెంట్ కార్యక్రమంలో రాష్ట్రంలోని 33 జిల్లాల నుంచి 66 మంది విద్యార్థులు పాల్గొన్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మెదక్ జిల్లా తరపున పాల్గొన్న ఆర్తి చంద్ర డిప్యూటీ స్పీకర్‌గా వ్యవహరించి, ప్రజాస్వామ్య వ్యవస్థ, పార్లమెంటరీ విధానాలపై అద్భుత ప్రతిభ కనబరిచి ఉత్తమ పార్లమెంటేరియన్‌గా అవార్డు సాధించిందని పేర్కొన్నారు. రాష్ట్రస్థాయిలో జరిగిన అవార్డుల ప్రదానోత్సవంలో రాష్ట్ర సమగ్ర శిక్ష సంయుక్త సంచాలకులు మదన్‌మోహన్ చేతుల మీదుగా ఆర్తి చంద్ర అవార్డు అందుకోవడం అభినందనీయమన్నారు. ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థులకు ప్రజాస్వామ్య వ్యవస్థ, పార్లమెంటరీ విధానాలపై అవగాహన కల్పించడంతో పాటు నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తాయని తెలిపారు. విద్యార్థులు కష్టపడి చదివి పదో తరగతి లో రాష్ట్రస్థాయిలో మంచి ర్యాంకులు సాధించాలని, భవిష్యత్తులో ఉన్నత స్థానాలకు చేరుకుని దేశానికి మంచి నాయకులుగా ఎదగాలని కలెక్టర్ ఆకాంక్షించారు.
అనంతరం ఆర్తి చంద్రతో పాటు ఆమెకు మార్గదర్శక ఉపాధ్యాయు డిగా వ్యవహరించిన పీజీ ఉపాధ్యాయుడు లింగమయ్య, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఈ విజయానికి సహకరించిన సామాజిక వేదిక బాధ్యులు నర్సింలు, రవిబాబులను కలెక్టర్ సన్మానించారు.ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి రాజు, సహాయ పర్యవేక్షణ అధికారి సుదర్శన్ మూర్తి, సంబంధిత పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

అమ్మాయిల విషయంలో అబ్బాయిలు జాగ్రత్తగా ఉండాలి

- జిల్లా బాలల హక్కుల పరిరక్షణ అధికారి అనిత





చేర్యాల, నవంబర్ 02 (జనంసాక్షి): అమ్మాయిల పట్ల అబ్బాయిలు చెడుగా ప్రవర్తించకూడదని, అమ్మాయిల హక్కులను గౌరవించాలని, లేనిపక్షంలో ఫోక్సో చట్టం కింద కఠిన చర్యలు తప్పవని జిల్లా బాలల హక్కుల పరిరక్షణ అధికారి అనిత విద్యార్థులకు సూచించారు. సోమవారం చేర్యాల సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయంలో ప్రిన్సిపాల్ పోలోజు నరసింహాచారి అధ్యక్షతన బాలల హక్కులు, చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన అనిత మాట్లాడుతూ.. విద్యార్థులు చెడు వ్యసనాలకు బానిసలైతే భవిష్యత్తు నాశనమవుతుందని, నేరాల పాలై శిక్ష అనుభవించాల్సి వస్తుందని హెచ్చరించారు. పాశ్చాత్య సంస్కృతికి ఆకర్షితులు కాకుండా లక్ష్యంపై దృష్టి పెట్టి ఉన్నత చదువులు చదవాలని, డ్రగ్స్, గంజాయి, మత్తు చాక్లెట్లు వంటి మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని సూచించారు. సోషల్ మీడియాకు అతిగా అలవాటు పడవద్దని, పాఠ్యపుస్తకాలను ప్రేమించాలని తెలిపారు.
ప్రేమ పేరుతో జరుగుతున్న మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, విద్యార్థులు నేరాలకు పాల్పడితే తల్లిదండ్రులకు కూడా ఇబ్బందులు తప్పవని గుర్తు చేశారు.కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ టిఆర్ఎస్
అభ్యర్థిగా ఆకాష్ కొల్లూరును గెలిపించాలి

- టిఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్



నారాయణపేట, నవంబర్ 2(జనంసాక్షి): రాబోయే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలో టిఆర్ఎస్ అభ్యర్థి ఆకాష్ కొల్లూరు ను గెలిపించా లని నారాయణపేట జిల్లా టిఆర్ఎస్ అధ్యక్షుడు గవినోల్ల శ్రీనివాస్ కోరారు.ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో నారాయణపేట జిల్లాలోని అర్హులైన పట్టభ ద్రులందరూ తమ ఓటు హక్కును నమోదు చేసుకో వాలని కోరారు.గతంలో పట్టభద్రుల ఓటరుగా నమోదు చేసుకొని ఓటు వేసినవారు సైతం ప్రస్తుత ఎన్నికల కోసం మళ్లీ కొత్తగా ఫారం-18 నింపి నమోదు చేసుకోవాలనిసూచించారు.
తెలంగాణ రక్షణ సేన పార్టీ తరఫున పట్టభద్రుల ఎమ్మె ల్సీ ఎన్నికల్లో బలహీన వర్గాలకు చెందిన ఆకాష్ కొల్లూరును పార్టీ అభ్యర్థిగా బరిలో నిలబెట్టడం జరిగిందని తెలిపారు. నిరుద్యోగులు, ఉద్యో గులు, యువత ఎదుర్కొంటున్న సమస్యలకు చట్టసభల్లో గొంతుకగా నిలవడమే తెలంగాణ రక్షణ సేన లక్ష్యమని పేర్కొన్నారు. పట్టభద్రుల హక్కుల పరిరక్షణ, నిరుద్యోగ సమస్యల పరిష్కారం, ఉద్యోగ అవకాశాల కల్పన, విద్యారంగ అభివృద్ధి, పట్టభద్రుల సంక్షేమం కోసం తెలంగాణ రక్షణ సేన నిరంతరం పోరాటం చేస్తుందని గవి నోళ్ల శ్రీనివాస్ తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రక్షణ సేన నాయకులు ఉలిగుండం అనంత్ రెడ్డి, విట్లపూర్ గుట్టల నర్సింహా, మొగలమాడక నర్సిములు పాల్గొన్నారు.

మత్తు పదార్థాల నిర్మూలనకు ప్రత్యేక తనిఖీలు

- కృష్ణ ఎస్ఐ ఎస్ఎం నవీద్



కృష్ణ, నవంబర్ 2 (జనంసాక్షి): మండలంలో మత్తు పదార్థాల నిర్మూలనకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు ఎస్సై నవీద్ తెలిపారు. సోమవారం జిల్లా ఎస్పీ డాక్టర్ జి. వినీత్ ఆదేశాల మేరకు మత్తు పదార్థాల నిర్మూలనకు చేపడుతున్న ప్రత్యేక చర్యల్లో భాగంగా కృష్ణ మండలంలో నార్కోటి క్స్ స్నైపర్ పోలీసు జాగిలం తో ఆకస్మిక తనిఖీలు నిర్వ హించినట్లు కృష్ణ ఎస్ఐ ఎస్ఎం నవీద్ తెలిపారు.
ఈ సందర్భంగా రైల్వే స్టేషన్, పాన్ షాపులు, కిరాణా షాపులు తదితర అనుమానాస్పద ప్రదేశాల్లో విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాల అక్రమ రవాణా, నిల్వ, విక్రయాలు, వినియోగాన్ని పూర్తిగా అరికట్టేందుకు పోలీసు శాఖ నిరంతరం నిఘా ఏర్పాటు చేసి ప్రత్యేక తనిఖీలు నిర్వహిస్తోందని ఎస్ఐ తెలిపారు.యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, వాటి బారిన పడకుండా తల్లిదండ్రులు తమ పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. ఎవరైనా గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలను వినియోగిస్తున్నా, రవాణా చేస్తున్నా లేదా విక్రయిస్తు న్నా వెంటనే టోల్ ఫ్రీ నంబ ర్ 1908 లేదా డయల్ 112కు సమాచారం అందించాలని కోరారు. సమాచారం అందించిన వారి వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచబడతా యని తెలిపారు.ఈ తనిఖీ ల్లో ఏ ఎస్సై సురేందర్ బాబు, నార్కోటిక్స్ స్నైపర్ డాగ్ విక్కి, డాగ్ హ్యాండ్లర్ పీసీ పరమేశ్ పాల్గొన్నారు.

తోట కోల్డ్ పరిశ్రమ బరితెగింపు.. రాత్రికి రాత్రి రెండు గుడుల తొలగింపు

• పరిశ్రమ ముందు దర్నకి దిగిన గ్రామస్థులు..





తూప్రాన్, నవంబర్ 2(జనంసాక్షి): గత కొన్ని సంవత్సరాలుగా ఉన్న రెండు పురాతన దేవుళ్ల గుడులను ఓ పరిశ్రమ ఎవరికి తెలియకుండా రాత్రికి తొలగించి నేలమట్టం చేయడంతో గ్రామస్తు లు ఆందోళన దిగారు. మనోహరబాద్ మండలం ముప్పిరెడ్డిపల్లి గ్రామం శివారులో గుడులు గత కొన్ని సంవత్సరాలుగా గ్రామస్థులు గుడి నిర్మాణ యజ మానులు ప్రత్యేక పూజలు నిర్వహించేవారు.కొన్ని నెలల క్రితం ఈ భూమి టీజీఐఐసి వారు తీసుకుని పరిశ్రమ నిర్వహించారు.అక్కడ ఉన్న తోట కోల్డ్ పరిశ్రమ వారు ఉన్న రెండు గురువులను అలాగే ఉంచారు.ఈ దేవాలయాల విషయంలో యజమాను లు మాట్లాడి విగ్రహాలు ప్రక్కకు తీసుకెళ్లి వేరే భూమిలో గుడి ఏర్పాటుకి ఒప్పుకున్నారు. తీరా ఈ రోజు ఉదయం చూసే వరకు రెండు గుడులను తొలగించి ఓ గుంత తీసి అందులో వేసే ప్రయత్నం చేశారు.అక్కడ ఉన్న విగ్రహాలను ఒక ములాన షెడ్డు వేసి ఉంచారు. గ్రామస్తులకు సమాచారం లేకుండా ఎలా చేస్తారని పాలకవర్గ సబ్యులు గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేశారు.



ఆందోళన చేసిన గుడి యాజమాన్యం, గ్రామస్థులు... 40 సంవత్సరాలుగా గుడి కట్టి పూజలు చేస్తున్న మనకి సమాచారం ఇవ్వకుండా ఎలా గుడ్లను తొగిస్తారు అని ఆగ్రహం వ్యక్తం చేశారు.పరిశ్రమ లోపలికి వెళ్ళి గుడిలో విగ్రహాలను చూసి తీవ్ర దిభ్రాంతికి గురయ్యారు. ఒక సమయంలో పూనకం వచ్చి ఆందోళనకు గురయ్యారు. అధికారులు స్పందించి పరిశ్రమ పై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.ఇంతకు ముందు ఎలా ఉన్నాయో అలా ఉరికి గుడి కట్టించి న్యాయం చేయాలని కోరారు.లేదంటే గ్రామస్థులతో పరిశ్రమ వద్ద ధర్నా నిర్వహిస్తామని హెచ్చరించారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ సుభాష్ గౌడ్ ఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు.

ముప్పిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన పెద్దకుంట అలుగు కూడా కబ్జా చేసి పెద్ద ఎత్తున గోడ ఏర్పాటు చేసి అక్కడికి వచ్చే అలుగు నీటిలో గుడి నిర్మాణం చేసి రెండు సమస్యలను ఒకేసారీ తొలగించే ప్రయత్నం చేస్తున్నారు అని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.సంబధిత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు..



ప్రజావాణి

ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించాలి

• అదనపు కలెక్టర్ నగేష్

మెదక్ బ్యూరో, నవంబర్2(జనంసాక్షి): ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి అందిన ఫిర్యాదులకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ, వాటిని పరిశీలించి నిబంధనల ప్రకారం పరిష్కరించాలని అదనపు కలెక్టర్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేష్ , డిఆర్‌వో అంబాదాస్ రాజేశ్వర్‌లు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు.

ఈ సందర్భంగా ఫిర్యాదుదారుల సమస్యలను అడిగి తెలుసుకుని, వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖల అధికారులకు సూచించారు. ప్రజావాణికి వచ్చే ప్రతి ఫిర్యాదును క్షుణ్ణంగా పరిశీలించాలని, సమస్యకు సంబంధించిన వివరాలను నిర్ధారించుకుని నిబంధనల మేరకు పరిష్కరించాలని అదనపు కలెక్టర్ స్పష్టం చేశారు. ఫిర్యాదుల పరిష్కారంలో అనవ సర జాప్యం చేయకుండా, బాధితులకు సత్వర న్యాయం జరిగేలా అధికారులు బాధ్యతతో వ్యవహరించాలని ఆదేశించారు.ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం 62 ఫిర్యాదులు అందినట్లు అధికారులు తెలిపారు. అందులో భూ భారతి 25, ఇందిరమ్మ ఇండ్లు 12, పెన్షన్ 01,ఇతర 24 మొత్తం 62 అందాయన్నారు. ఈ కార్యక్ర మంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

నంగునూరు, బద్దిపడగలో

బీఆర్ఎస్‌వి నూతన కమిటీలు



నంగునూరు, నవంబర్ 2 (జనంసాక్షి): మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆదేశాల మేరకు బీఆర్ఎస్‌వి మండల సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో నంగునూరు, బద్దిపడగ గ్రామాల్లో నూతన విద్యార్థి కమిటీలను ఏర్పాటు చేశారు. ఒక్కో కమిటీలో 15 నుంచి 18 మందిని నియమించారు.



బద్దిపడగ అధ్యక్షుడిగా మొలుగు సాయికుమా ర్, ప్రధాన కార్యదర్శి గా కాయిత కిషోర్, నంగునూరు అధ్యక్షుడిగా దేవులపల్లి కృష్ణ, ప్రధాన కార్యదర్శిగా వానరాశి అనిల్ ఎంపికయ్యారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ విద్యార్థుల సమస్యలు, నిరుద్యోగుల హామీల అమ లు కోసం బీఆర్ఎస్‌వి పోరాటాలు కొనసాగిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

క్రీడల్లో గెలుపోటములు సహజం: చింత సాయి





సంగారెడ్డి, నవంబర్ 2 (జనంసాక్షి): క్రీడల్లో గెలుపోటములు సహజమని, ఓడినవారు నిరాశ చెందకుండా గెలుపు కోసం కృషి చేయాలని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు చింత సాయి సూచించారు. సదాశివపేటలో టీమ్ యూఎఫ్ఓ క్రికెట్ జట్టు ఐదో వార్షికోత్సవం సందర్భంగా 2025-26 సంవత్సరానికి ఉత్తమ క్రీడాకారులకు పురస్కారాలు అందజేశారు. ప్లేయర్ ఆఫ్ ద ఇయర్, ఉత్తమ బ్యాటర్‌గా రియాజ్ పటేల్, ఉత్తమ బౌలర్‌గా అకీబ్ పటేల్, ఉత్తమ ఫీల్డర్‌గా ఆసిఫ్ పటేల్ ఎంపికయ్యారు. ఈ సందర్భంగా చింత సాయి మాట్లాడుతూ క్రీడలు శారీరక దారుఢ్యంతో పాటు ఐక్యత, సోదరభావాన్ని పెంపొందిస్తాయని తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్ వై. సంక్షయ్ గౌడ్, సయ్యద్ రాఫే అల్తమాష్, రోషన్ పటేల్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా సమైక్య భవనానికి భూమిపూజ

• సర్పంచ్ సారంగి అనూష లాల్ కుమార్, ఉపసర్పంచ్ విజయ్ రావు పాటిల్



కంగ్టి, నవంబర్ 2 (జనంసాక్షి): మహిళల ఐక్యత, అభ్యున్నతి, ఆర్థిక స్వావలంబనకు ప్రోత్సాహం అందించే లక్ష్యంతో ముర్కుంజాల్ గ్రామంలో మహిళా సమైక్య భవన నిర్మాణానికి సర్పంచ్ సారంగి అనూష లాల్ కుమార్, ఉప సర్పంచ్ విజయరావు పాటిల్ భూమిపూజ నిర్వహించారు. వి.బి.జి. రాంజీ నిధుల నుంచి భవన నిర్మాణానికి రూ. 10 లక్షలు మంజూరు కావడంతో పనులు ప్రారంభించారు. ఈ సంద ర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ మహిళా సంఘా ల సమావేశాలు, అభివృద్ధి కార్యక్రమాలు, చర్చలకు ఈ భవనం ప్రత్యేక వేదికగా ఉపయోగ పడుతుందని తెలిపారు. మహిళలు అన్ని రంగాల్లో రాణించేలా గ్రామంలో అభి వృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు, మాజీ సర్పంచ్ నారాయణ రెడ్డి, మాజీ సొసైటీ డైరెక్టర్ దిగంబ రావు పాటిల్, మహిళా సంఘాల నాయకులు, గ్రామ పెద్దలు, యువ కులు తదితరులు పాల్గొన్నారు.



చేర్యాలలో చిట్టీల పేరుతో ఘరానా మోసం...

• 50 మంది వద్ద రూ. కోటిన్నర వసూలు చేసి పరారీ



చేర్యాల, నవంబర్ 02 (జనంసాక్షి): చేర్యాల పట్టణ కేంద్రంలోని బీడీ కాలనీలో చిట్టీల పేరుతో కోటిన్నర రూపాయల మేర మోసానికి పాల్పడిన ఘటన వెలుగులోకి వచ్చింది. చేర్యాల పట్టణానికి చెందిన మహమ్మద్ అజీజ్ అహ్మద్ అనే వ్యక్తి గత కొన్నేళ్లుగా బీడీ కాలనీ ప్రాంతం లో చిట్టీల వ్యాపారం నిర్వహిస్తున్నాడు. స్థానిక పేద ప్రజలు తమ పిల్లల పెళ్లిళ్లు, చదువుల కోసం రూపాయి రూపాయి కూడబెట్టి అతని వద్ద చిట్టీలు వేశారు. అయితే కొన్ని రోజుల క్రితం చిట్టీలు కట్టిన వారికే వారు అప్పు ఉన్నట్లుగా నోటీసులు పంపించాడు. విషయం తెలుసుకుని బాధితులు అతని ఇంటికి వెళ్లగా అతను పరారీలో ఉన్నట్లు తెలిసింది. దీంతో తాము మోసపోయామని గ్రహించిన బాధితులు సోమవారం తమ గోడును విలేకరుల ముందు వెళ్లబోసుకున్నారు. రోజువారీ కూలీలు, బీడీ కార్మికులమైన తాము నమ్మి డబ్బులు కట్టామని, ప్రభుత్వం, అధికారులు స్పందించి తమ డబ్బు లు ఇప్పించాలని బాధితులు కోరుతున్నారు.



పారిశుద్ధ్య కార్మికుల

వేతనాలు వెంటనే చెల్లించాలి



కృష్ణ, నవంబర్ 2 (జనంసాక్షి): పాఠశాల పారిశుద్ధ్య కార్మికులకు పెండింగ్‌లో ఉన్న గౌరవ వేతనాలు వెంటనే చెల్లించాలని పీఆర్టీయూ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం కృష్ణ మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో కిషోర్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. 2026-27 విద్యా సంవత్సరానికి సంబంధించి 45 రోజుల గౌరవ వేతన నిధులు జిల్లా కలెక్టర్ కార్యాలయం నుంచి ఎంపీడీవో ఖాతాకు బదిలీ అయ్యాయని తెలిపారు. నిధులను వెంటనే అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలకు విడుదల చేసి కార్మికులకు చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో పీఆర్టీయూ ప్రధాన కార్యదర్శి అనిల్ కుమార్, ఎన్. శివరాజ్, అజయ్, దేవేంద్రమ్మ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ ఇసుక

టిప్పర్ పట్టివేత.. కేసు నమోదు



మక్తల్, నవంబర్ 02 (జనంసాక్షి): మక్తల్ మండలం లింగంపల్లి గ్రామ సమీపంలో అక్రమంగా ఇసుక తరలిస్తున్న టిప్పర్‌ను టాస్క్ ఫోర్స్, మక్తల్ పోలీసులు సంయుక్తంగా పట్టుకున్నారు. లింగంపల్లి మీదుగా TG 38 T 3965 నంబర్ గల టిప్పర్‌లో ఇసుక తరలిస్తుండగా వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై రాజు తెలిపారు. అప్పంపల్లికి చెందిన టిప్పర్ డ్రైవర్ శ్రీనుతో పాటు, వాహన యజమాని రవి పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. సహజ వనరుల దోపిడీకి, ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే చట్టపరమైన కఠిన చర్యలు తప్పవని, నిఘా నిరంతరం కొనసాగుతుందని స్పష్టం చేశారు.



మృతి చెందిన హోంగార్డ్ కుటుంబానికి
పోలీస్ శాఖ అండగా ఉంటుంది: జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్

నారాయణపేట జిల్లా బ్యూరో నవంబర్ 2(జనంసాక్షి): నారాయణపేట జిల్లా పోలీస్ శాఖలో హోంగార్డు గా విధులు నిర్వహిస్తూ ఇటీవల గుండెపోటుతో ఆకస్మికంగా మృతి చెందిన బాలకృష్ణ కుటుంబానికి జిల్లా పోలీస్ శాఖ అండగా నిలిచింది. పోలీస్ వెల్ఫేర్ నిధి నుంచి మంజూరైన రూ.15వేల పరిహార చెక్కు ను సోమవారం జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ మృతుడి భార్య భవానికి అందజేశా రు.కొత్తపల్లి మండలం గోకుల్ నగర్‌కు చెందిన బాలకృష్ణ నారాయణపేట జిల్లా పోలీస్ శాఖలో హోం గార్డుగా విధులు నిర్వహిం చారు. ఆయన ఆకస్మిక మరణంతో భార్య భవాని, ముగ్గురు చిన్నారులు కుటుంబ పెద్దను కోల్పోయి తీవ్ర విషాదంలో ఉన్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ శాఖలో బాలకృష్ణ అందించిన సేవలను గుర్తు చేసుకున్నా రు. విధి నిర్వహణలో భాగంగా పోలీస్ శాఖకు సేవలందించిన సిబ్బంది కుటుంబాలకు శాఖ ఎల్ల ప్పుడూ అండగా ఉంటుం దని, ఆపద సమయంలో వారికి అవసరమైన సహా య సహకారాలు అందిం చేందుకు పోలీస్ శాఖ ముందుంటుందని భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పి ఎండి రియాజ్ హుల్ హక్,ఆర్ ఎస్పై శివ శంకర్ పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలి

- పర్యావరణహిత జీవన విధానాలను అలవర్చుకోవాలి
- ఈనెల 7 వరకు బ్రిక్స్ సుస్థిర జీవనశైలి వారోత్సవాలు
- అదనపు కలెక్టర్ సంగీత

సంగారెడ్డి బ్యూరో, నవంబర్ 2 (జనంసాక్షి): విద్యుత్, ఇంధన వనరులను పొదుపుగా వినియోగిస్తూ పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా కృషి చేయాలని అదనపు కలెక్టర్ సంగీత సూచించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో తెలంగాణ పునరుత్పాదక ఇంధన వనరుల అభివృద్ధి సంస్థ సంగారెడ్డి జిల్లా శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఇంధన పరిరక్షణ ప్రతిజ్ఞ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు.

ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ సంగీత మాట్లాడుతూ... ఎల్‌నినో ప్రభావంతో వాతావరణంలో మార్పులు, ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశాలను దృష్టిలో ఉంచుకొని విద్యుత్ వినియోగంలో పొదుపు





పాటించాలని సూచించారు. అవసరం లేనప్పుడు దీపాలు, ఫ్యాన్లు, ఇతర విద్యుత్ ఉపకరణాలను నిలిపివేయాలని, ఇంధనాన్ని ఆదా చేసే ఉపకరణాలను వినియోగించాలని కోరారు. సహజ వనరులను కాపాడుతూ పర్యావరణహిత జీవన విధానాలను అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు.

బ్రిక్స్ సుస్థిర జీవనశైలి వారోత్సవాల్లో భాగంగా నవంబర్ 1 నుంచి 7వ తేదీ వరకు ఇంధన పొదుపు, పర్యావరణ పరిరక్షణపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు సంస్థ జిల్లా మేనేజర్ శ్రీనివాసరావు తెలిపారు. చిన్నచిన్న మార్పులతోనే ఇంధనాన్ని ఆదా చేసి పర్యావరణాన్ని కాపాడవచ్చని పేర్కొన్నారు.

కార్యక్రమంలో జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి జానకిరెడ్డి, సాంఘిక సంక్షేమ శాఖ ఉప సంచాలకుడు అఖిలేష్ రెడ్డి, జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి జగదీష్, జిల్లా సంక్షేమ అధికారి లలిత కుమారి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి లలిత దేవి, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి వసంతకుమారి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో "సురక్షిత్ బచ్‌పన్ అభియాన్" పై న్యాయమూర్తుల అవగాహన

నారాయణపేట, నవంబర్ 2(జనంసాక్షి): సురక్షిత్ బచ్‌పన్ అభియాన్‌లో భాగంగా శనివారం జిల్లాలోని మూడు పాఠశాలల్లో ఒకేసారి అవగాహన కార్యక్రమాలు నిర్వహించా రు. ఈ కార్యక్రమాల్లో న్యాయమూర్తులు పాల్గొని విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పించారు.

మోడరన్ ఉన్నత పాఠశాల, నారాయణపేటలో సీని యర్ సివిల్ జడ్జి, ఫ్యాక్ సెక్రటరీ,డి ఎల్ ఎస్ ఏ వింధ్య నాయక్ పాల్గొన్నారు.నా బాల్ వివాహ్, నా బాల్ శోషణ్" అంశంపై బాల్య వివాహాలు నేరమని పోక్సో చట్టం గురించి వివరించారు. శ్రీ సరస్వతి శిశు మందిర్ ఉన్నత పాఠశాలలో ప్రిన్సిప ల్ జూనియర్ సివిల్ జడ్జి పాల్గొని "మేరా బచ్‌పన్, మేరా అధికార్" అంశంపై ప్రతి బిడ్డకు ఉన్న హక్కులు, గుడ్ టచ్ బ్యాడ్ టచ్ గురించి తెలియ జేశారు.శ్రీ సాయి ఉన్నత పాఠశాలలో అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి అవినాష్ పాల్గొని "జాగృక్ బచ్‌పన్, సశక్త్ భారత్" అంశంపై పిల్లలు అప్రమ త్తంగా ఉంటేనే దేశం బలంగా ఉంటుందని, 1098 టోల్ ఫ్రీ నంబర్ గురించి వివరించారు.

అనంతరం న్యాయమూ ర్తులు మాట్లాడుతూచైల్డ్ వెల్ఫేర్ కమిటీ, మహిళా శిశు సంక్షేమ శాఖ పాత్ర వివరిస్తూ, లైంగిక వేధింపులు, బాల కార్మికులు, మానవ రవాణా నుండి రక్షించబడిన పిల్లలను 24 గంటల్లో సి దబ్ల్యు సి ముందు ప్రవేశపెడతారని తెలిపారు. వారికి సురక్షితమైన ఆశ్రయం, వైద్య సహాయం మరియు కౌన్సెలింగ్ అందిస్తారన్నారు.భరోసా కేంద్రం గురించి - లైంగిక వేధింపులకు గురైన పిల్లలు పోలీస్ స్టేషన్లు, హాస్పిటళ్లు, కోర్టుల చుట్టూ తిరగకుండా ఒకే గొడుగు కింద అన్ని సేవలను అందిస్తుందని



తెలిపారు. సఖి సెంటర్ గురించి - హింసకు గురైన బాలికలకు ఒకే చోట అన్ని రకాల సేవలను అందిస్తుందని వివరించారు.లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ లక్ష్మిపతి గౌడ్ గారు మాట్లాడుతూ డి ఎల్ ఎస్ ఏ పాత్రను వివరిస్తూ, జిల్లా మెజిస్ట్రేట్, జిల్లా విద్యాశా ఖాధికారి, ఎస్పి లతో కూడిన జిల్లాస్థాయి కమిటీల ద్వారా ఈ ప్రచారాన్ని పర్యవేక్షి స్తున్నామన్నారు. చివరగా విద్యార్థులచే "జాగ్రత్త, సురక్ష, సంరక్షణ - ప్రతి బిడ్డ హక్కు" అని ప్రతిజ్ఞ చేయించారు. ఈ రోజు తెలుసుకున్న చట్టాలను ఇంటికి వెళ్లి తల్లిదండ్రులకు, స్నేహితు లకు చెప్పాలని సూచిం చారు.

అనంతరం సురక్షిత్ బచ్‌పన్ అభియాన్ గోడ స్టిక్కర్లను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో చైల్డ్ డిపార్ట్మెంట్ సిబ్బంది కరిష్మా, నర సింలు, భరోసా, సఖి సెంటర్ శారద, వివిధ పాఠశాలల ప్రధానోపా ధ్యాయులు సాగర్ తదితరులు, ఉపాధ్యాయులు, ప్యానల్ న్యాయవాదు పారా లీగల్ వాలంటీర్లు పాల్గొన్నారు.

బెల్టు షాపుల్లో దోరికె బ్రాండ్ వైన్స్‌లో దొరకదు

రాజాపూర్, నవంబర్ 2(జనంసాక్షి): రాజాపూర్ మండల కేంద్రంలో గల విజయదుర్గ మద్యం దుకాణంలో మద్యం ప్రియులకు కావలసిన బ్రాండ్ దొరకడం లేదని, మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో ఉన్న బెల్టు షాపుల్లో మాత్రం అన్ని రకాల మద్యం దొరుకుతుంది అని రాజాపూర్ యువకులు ప్రజావాణి లో పిర్యాదు చేశారు.నాసిరకం బ్రాండ్ లు వైన్స్ లో అమ్మి ప్రజల ఆరోగ్యంతో చెలగాటం



ఆడుతున్నారని, తమ లాభంకోసం తక్కువ ధరల మద్యం మాత్రమే వైన్స్ లో అమ్ముతున్నారు అని పిర్యాదు లో పేర్కొన్నారు. ఎక్సైజ్ శాఖ అధికారులు ఎటువంటి తనిఖీలు నిర్వహించక పోవడంతో గ్రామాల్లో విచ్చలవిడిగా బెల్టు షాపులు నడుస్తున్నాయి. బెల్టు షాపుల్లో వైన్స్ లో దొరకని మద్యం దొరుకుతుంది అంటే మద్యం కల్తీ జరుగుతుందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఎక్సైజ్ శాఖ అధికారులు ఇప్పటికైనా స్పందించి మద్యం నిల్వలపై వైన్స్ లో తనిఖీలు నిర్వహిస్తారా ! గ్రామాల్లో మద్యం బెల్టు షాపులకు ఎక్కడి నుండి వస్తుందో ఆరా తీస్తారా ! అని ప్రజలు కోరుతున్నారు. ఎక్సైజ్ శాఖ అధికారులకు ఆదాయం మీద ఉన్న శ్రద్ధ మద్యం అమ్మకాల్లో జరిగే అవకతవకలపై లేదని పలువురు విమర్శిస్తున్నారు. ప్రజావాణిలో విజయదుర్గా మద్యం దుకాణంపై యాదగిరి, లింగం,నజీంబేగ్, రాచమల్ల యాదగిరి , వెంకటేష్‌లు ట్రైనీ కలెక్టర్ సాయి శివాని కి పిర్యాదు చేశారు.

బ్యాలెట్ ఎన్నికలకు సిద్ధం.. ప్రభుత్వాన్ని రద్దు చేస్తారా?

మక్తల్, నవంబర్ 2 (జనంసాక్షి): ఎస్ఐఆర్ ప్రక్రియపై కాంగ్రెస్ అభ్యంతరాలు వ్యక్తం చేయడాన్ని బీజేపీ జిల్లా మైనారిటీ మోర్చా ప్రధాన కార్యదర్శి జావీద్ హుస్సేన్ విమర్శించారు. దొంగ ఓట్లు, మరణించిన వారి ఓట్లు తొలగిస్తే కాంగ్రెస్‌కు అభ్యంతరం ఎందుకని ప్రశ్నించారు. ఈవీఎంలపై అనుమానాలు వ్యక్తం చేస్తున్న సీఎం రేవంత్ రెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని రద్దు చేసి బ్యాలెట్ పద్ధతిలో ఎన్నికలకు సిద్ధం కావాలని సవాల్ విసిరారు. తెలంగాణలో బ్యాలెట్ ఎన్నికలకు బీజేపీ సిద్ధంగా ఉందన్నారు. రాష్ట్రంలో 20 లక్షలకు పైగా దొంగ ఓట్లు ఉన్నాయని ఆరోపిస్తూ, ఎస్ఐఆర్ ప్రక్రియ కొనసాగించాలని, జాతీయ స్థాయిలో ఎన్ఆర్‌సీ అమలు చేయాలని పేర్కొన్నారు.



ప్రజల ఆరోగ్య పరిరక్షణే సహన సంస్థ లక్ష్యం...

- అంసానిపల్లిలో ఉచిత వైద్య శిబిరం

కొల్చారం, నవంబర్ 02 (జనంసాక్షి): ప్రజల ఆరోగ్య పరిరక్షణతో పాటు బాలల హక్కులను కాపాడుతూ, బాల కార్మికులు లేని ఆదర్శ గ్రామాల నిర్మాణమే లక్ష్యంగా సహన సంస్థ పనిచేస్తోందని సంస్థ ప్రతినిధి సత్యనారాయణ తెలిపారు. ఇందులో భాగంగా కొల్చారం మండలంలోని అంసానిపల్లి గ్రామంలో సహన సంస్థ మల్లారెడ్డి ఆసుపత్రి సహకారంతో సోమవారం ఉచిత వైద్య శిబిరాన్ని గ్రామ సర్పంచ్ రామన్న గీత ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ శిబిరంలో గ్రామ ప్రజలకు సాధారణ ఆరోగ్య పరీక్షలతో పాటు జలుబు, దగ్గు, జ్వరం వంటి అనారోగ్య సమస్యలకు సంబంధించి వైద్య సేవలు అందించారు. బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించి ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ రామన్న గీత మాట్లాడుతూ.. గ్రామ ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం ఉచిత



వైద్య శిబిరాన్ని నిర్వహించడం అభినందనీయ మన్నారు.

ప్రజలకు సేవలందిస్తున్న సహన సంస్థ ప్రతినిధులకు, మల్లారెడ్డి ఆసుపత్రి వైద్యులు, సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. ఇలాంటి సేవా కార్యక్రమాలకు గ్రామ పంచాయతీ తరపున పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. సహన సంస్థ ప్రతినిధి సత్యనారాయణ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యం పట్ల బాధ్యతగా వ్యవహరించాలని, ఆరోగ్య సమస్యలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఫణీందర్ కుమార్, గ్రామ సర్పంచ్ గీత రమేష్ , వార్డు సభ్యులు, మల్లారెడ్డి ఆసుపత్రి వైద్యులు డాక్టర్ ప్రీతం కుమార్ రెడ్డి, డాక్టర్ శివ సాత్విక, నర్సింగ్ సిబ్బంది పావని, నందిని, ఫాతిమా, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ నాగప్ప, మేనేజర్ మహమూద్ తదితరులు పాల్గొన్నారు.

నీటి విషయంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు...

సంగారెడ్డి బ్యూరో, నవంబర్ 2 (జనంసాక్షి): భూగర్భ జలాల పరిరక్షణకు కఠిన చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ అశోక్ అధికారులను ఆదేశించారు. వాల్టా చట్టానికి విరుద్ధంగా కొత్త బోర్లు తవ్వితే స్వాధీనం చేసుకోవాలని సూచించారు. ఈ మేరకు మహమ్మదాపూర్ గ్రామంలోని అంకుర వెంచర్ ప్రాంగణంలో రెండు



బోర్లను ఆర్ఐ, జీపీఓలు స్వాధీనం చేసుకున్నారు. నీటి సంక్షోభాన్ని దృష్టిలో ఉంచుకుని అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని, విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని తహసీల్దార్ హెచ్చరించారు. నీటి వనరుల పరిరక్షణకు ప్రజలు సహకరించాలని కోరారు.